జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి   శనివారం 24 మే 2025   సంపుటి : 15   సంచిక : 254   వెల: రూ.5   పేజీలు: 08   RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI   http://www.prajajyothinews.com   Mail: prajajyothidaily@gmail.com

# నోరు తెరుస్తున్న సీనియర్లు



- మంత్రి పదవులు ఆశించి భంగపడ్డ సీనియర్ ఎమ్మెల్యేలు నోరు తెరుస్తున్నారు.
- ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు తెలుగుదేశం పార్టీ మహానాడు కడపలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే
- అయితే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మినీ మహానాడులు నిర్వహించాలని పార్టీ హైకమాండ్ ఆదేశించింది

మినీ మహానాడులో కొంత మంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు

**అమరావతి**

తెలుగుదేశం పార్టీలో అక్కడక్కడ అసంతృప్తులు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మంత్రి పదవులు ఆశించి భంగపడ్డ సీనియర్ ఎమ్మెల్యేలు నోరు తెరుస్తున్నారు. తమ మనసులో ఉన్న మాటను బయట పెడుతున్నారు. ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు తెలుగుదేశం పార్టీ మహానాడు కడపలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మినీ మహానాడులు నిర్వహించాలని పార్టీ హైకమాండ్ ఆదేశించింది. ఈ తరుణంలో తూర్పుగోదావరి జిల్లా టిడిపి మినీ మహానాడులో ఆ పార్టీ నేతలు సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా జనసేనతో వస్తున్న సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా పార్టీ - మిగతా3లో





## కోటాలోనే విద్యార్థులు ఎందుకు చనిపోతున్నారు?

- ప్రభుత్వాన్ని నిలదీసిన సుప్రీం
- ఈ ఏడాది ఇప్పటికే 14 మంది విద్యార్థులు బలవంతంగా ప్రాణాలు తీసుకోవడాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు
- రాష్ట్ర ప్రభుత్వంగా ఏం చేస్తున్నారంటూ నిలదీసింది.

## గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విధ్వంసం

- ఒక్కో రంగాన్ని ప్రక్షాళన చేసుకుంటూ ముందుకెళ్తున్నాం.
- వైసీపీ చేసిన విధ్వంసానికి రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే పదేళ్ల పడుతుంది
- ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమకు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారు.
- ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తాం



**ఢిల్లీ**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముందెన్నడూ లేని విధంగా విధ్వంసం జరిగిందని ఆంధ్రప్రదశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. వైసీపీ చేసిన విధ్వంసానికి రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే పదేళ్ల పడుతుందని తెలిపారు. ఒక్కో రంగాన్ని ప్రక్షాళన చేసుకుంటూ ముందుకు వెళుతున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమకు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. కేంద్ర మంత్రులతో ఆయన వరుసగా భేటీలు అవుతున్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, రాష్ట్ర సమస్యలను ఆయన కేంద్ర మంత్రులకు వివరిస్తున్నారు. - మిగతా3లో




## రెండు రాష్ట్రాల రైతులకు మేలు చేయాలనేదే మా ఉద్దేశం

- వినియోగదారులకు మేలు రకమైన బియ్యం అందుబాటు ధరలో ఉండాలనేదే తమ ఉద్దేశం
- ఏపీలో జూన్ 12 నుంచి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కింద సన్న బియ్యం
- “ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు ఉండాలి
- ఆస్తులు బదిలీ కావాల్సి ఉంది

## అటెన్షన్‌లో కేంద్రమంత్రులు



## ముంబైలో కేసుల పెరుగుదల

- అదే బాటలో తమిళనాడు, గుజరాత్
- దేశంలోని పలు రాష్ట్రాల్లోనూ కరోనా కేసులు నమోదు
- వేగంగా కొన్ని దేశాలలో కోవిడ్-19 కేసులు

## ఈ వ్యవహారాన్ని విడిచిపెట్టం

- హరికృష్ణకు పోలీసుల వేధింపులపై వైఎస్ జగన్ ఫైర్
- ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే వారిపై హింసకు పాల్పడడం ఎంతవరకు సమంజసం?
- చట్టాన్ని చేతిలోకి తీసుకునే అధికారాన్ని వీరికి ఎవరు ఇచ్చారు?’
- థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా? దాన్ని సమర్థించుకునేందుకు ఒక కట్టుకథ అల్లుతారా?.



## భారత్ అంటే ప్రపంచానికి తెలిసేలా చేశాం

- భారత సైన్యాన్ని మెచ్చుకున్న అమిత్ షా..
- ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, బీఎస్ఎఫ్, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు అద్భుతంగా పనిచేశాయి
- గతంలో పాకిస్థాన్ ఆధ్వర్యంలో జరిగిన దాడులకు ఆయా ప్రభుత్వాలు తగిన సమాధానం ఇవ్వలేదు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆపరేషన్ విజయవంతమైంది

# ముంబైలో కేసుల పెరుగుదల

**ముంబై:** కరోనా మహమ్మారి మరోమారు విజృంభిస్తోంది. హాంకాంగ్, సింగపూర్‌తో సహా ఆసియాలోని కొన్ని దేశాలలో కోవిడ్-19 కేసులు వేగంగా పెరుగుతున్నాయి. భారతదేశంలోని పలు రాష్ట్రాల్లోనూ కరోనా కేసులు నమోదువుతున్నాయి. ఈ వివరాలను ఆయా రాష్ట్రాల అధికారులు మీడియాకు వెల్లడించాయి. మునుపటి వేవ్‌లతో పోలిస్తే మొత్తం కేసులు సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, దేశంలోని ముంబై, చెన్నై, అహ్మదాబాద్‌తో పాటు పలు నగరాలలో కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మహారాష్ట్ర ఆరోగ్య శాఖ తెలిపిన వివరాల ప్రకారం ప్రస్తుత మే నెలలో ముంబైలో ఇప్పటివరకూ కొత్తగా 95 కేసులు నమోదయ్యాయి. జనవరి నుండి చూసుకుంటే మహారాష్ట్రలో మొత్తంగా 106 కేసులు నమోదయ్యాయి. ఇది గణనీయమైన పెరుగుదల అని నిపుణులు అంటున్నారు. మహారాష్ట్రలో ప్రస్తుతం 16 మంది కోవిడ్ బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇన్‌ఫెక్షన్ వ్యాపించకుంగా ఉండేందుకు బాధితులను కెమ్ ఆస్పత్రి నుంచి సెవెన్ హిల్స్ ఆసుపత్రికి తరలించారని ది టైమ్స్ ఆఫ్ ఇండియా ఒక రిపోర్టులో వెల్లడించింది.



మరోవైపు ముంబై మహా నగరంలో ఇన్ఫ్లుఎంజా, శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న రోగులకు కోవిడ్-19 పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాగా ముందు జాగ్రత్త చర్యగా పూణేకు చెందిన వైద్యాధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. నాయుడు ఆసుపత్రిలో 50 పడకలను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం నగరంలో ప్రభుత్వ ఆసుపత్రులలో కరోనావైరస్ యాక్టివ్ కేసులు లేవు. ఇటీవల 87 ఏళ్ల వృద్ధుడికి పాజిటివ్ వచ్చిందని, అయితే అతను వైద్య చికిత్సతో కోలుకున్నాడని పూణే మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య శాఖ అధికారి నీనా బోరాడే తెలిపారు. ఆస్పత్రులలో ప్రస్తుతం ఎటువంటి పరీక్షలు నిర్వహించడం లేదని, కేంద్ర మార్గదర్శకాల కోసం ఎదురు చూస్తున్నట్లు నీనా తెలిపారు.
తాజాగా తమిళనాడు, గుజరాత్, కేరళలో కొత్తగా కోవిడ్-19 కేసులు నమోదయ్యాయి. అలాగే పుదుచ్చేరిలో 12 కొత్త కేసులు నమోదయ్యాయి. చెన్నైలో ఇన్ఫ్లుఎంజాకు కారణమైన జ్వరాలు పెరుగుతున్నాయి. ఇవి కరోనా ఇన్ఫెక్షన్ అనుమానాలను పెంచుతున్నాయి. ప్రస్తుతానికి కర్ణాటకలో 16 యాక్టివ్ కేసులను నిర్ధారించగా, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో కొత్తగా ఏడు కొత్త కేసులు నమోదయ్యాయి. వీరంతా ఇంటివద్దనే చికిత్స పొందుతున్నారు. వైద్యులు వీరి నుంచి శాంపిల్స్‌ను సేకరించి, ల్యాబ్‌కు పంపించారు. రిపోర్టుల కోసం ఎదురు చూస్తున్నారు.

# అటెన్షన్‌లో కేంద్రమంత్రులు

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీకి వస్తున్నారంటే కేంద్ర మంత్రుల్లో గుండె దడ మొదలవుతుంది. ఆయన ఫైళ్లు పట్టుకుని మరీ వచ్చి రాష్ట్రానికి సంబంధించిన నిధులు, ప్రాజెక్టుల కోసం వస్తారు. అందుకే చంద్రబాబు ఢిల్లీ టూర్ అంటే కేంద్ర మంత్రులు ఆయన ఏ ప్రతిపాదనలు తీసుకు వస్తారోనన్న ఉత్కంఠ వారిలో నెలకొంటుందట. ఏ ముఖ్యమంత్రి కూడా ఢిల్లీకి ఇన్నిసార్లు వచ్చి తమ రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, నిధుల కోసం ప్రయత్నించడం లేదని, కానీ చంద్రబాబు మాత్రం నెలలో రెండు సార్లు ఢిల్లీకి వచ్చి తమను కలసి వినతులను సమర్పించి తమ పనులను సాధించుకు వెళుతున్నారని కేంద్ర మంత్రులే అనుకుం టున్నారట. చంద్రబాబు నాయుడు నేడు ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. మూడు రోజుల పాటు ఢిల్లీలోనే చంద్రబాబు ఉండనున్నారు. నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీకి బయలుదేరి వెళతారు. రేపు కేంద్ర మంత్రులను చంద్రబాబు కలవనున్నారు.కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో పాటు ఏడుగురు కేంద్ర మంత్రులతో శుక్రవారం భేటీ కానున్నారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులపై చర్చించనున్నారు. దీంతో చంద్రబాబు వస్తున్నారని, అపాయింట్ మెంట్ కావాలని అడిగిన వెంటనే వారు పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టు వివరాలను తెప్పించుకునే పనిలో ఉన్నారట.ముఖ్యంగా ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ల మద్దతు పైనే ఆధారపడి ఉంది. వీరిద్దరూ మోదీ కంటే ముందు నుంచి రాజకీయాల్లో ఉన్నవారు. రాజకీయ




అనుభవం ఉన్న నేతలు మాత్రమే కాకుండా తమకు అవసరమైన వాటిని పట్టుబట్టి సాధించుకోవడంలో దిట్టలని పేరుపొందారు. ఇద్దరి నేతల అవసరాలు కూడా కేంద్రానికి ఉండటంతో అడిగిన వెంటనే అపాయింట్ మెంట్లు కూడా ఇచ్చేస్తున్నారు. అందులోనూ ఏపీ పరిస్థితి వేరు. అనేక హామీలు ఇచ్చి 2024 లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో, కేంద్ర ప్రభుత్వంలో రెండు పార్టీలు కలసి ఉన్నాయి..అయినా ప్రజా సమస్యల పరిష్కారం ఇలా చేయొచ్చుగా సామరస్యంగానే చెప్పి... ఈ నేపథ్యంలో చంద్రబాబు తీసుకు వచ్చే ప్రతిపాదనలతో పాటు నిధుల విషయంలో కూడా చూసీచూడనట్లు వ్యవహరించాల్సి ఉంటుంది. చంద్రబాబు కూడా ఒక పట్టాన వదిలి పెట్టే రకం కాదు. ఆయన గత పర్యటనలో తనకు ఇచ్చిన హామీలను ఇంకా పెండింగ్ లో ఉండటాన్ని కూడా ప్రస్తావించి కేంద్ర మంత్రులను ఇరకాటంలో పడేస్తారు. అంతే కాదు సామరస్యంగా, సానుకూలంగా మాట్లాడుతూనే రాష్ట్ర ప్రయోజనాలకు అవసరమైన ప్రాజెక్టులను, నిధులను తీసుకెళ్లడంలో చంద్రబాబు నేర్పరి అని హస్తినలో టాక్. అందుకే చంద్రబాబు హస్తిన ప్రయాణం అంటే టీడీపీ పార్లమెంటు సభ్యుల హడావిడి అటుంచితే.. కేంద్ర మంత్రులు మాత్రం హై అటెన్షన్ లో ఉండాల్సిందేనట.

# భారత్ అంటే ప్రపంచానికి తెలిసేలా చేశాం

**ఢిల్లీ:** దేశ రాజధానిలో జరిగిన 22వ బీఎస్ఎఫ్ పదవి పురస్కార కార్యక్రమానికి హాజరైన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసించారు. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, బీఎస్ఎఫ్, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు అద్భుతంగా పనిచేశాయని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆపరేషన్ విజయవంతమైందన్నారు. గతంలో పాకిస్థాన్ ఆధ్వర్యంలో జరిగిన దాడులకు ఆయా ప్రభుత్వాలు తగిన సమాధానం ఇవ్వలేదని అమిత్ షా విమర్శించారు. కానీ 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మారిందన్నారు. ఉగ్రవాద దాడులకు గట్టి సమాధానం ఇవ్వడమే కాదు, భారత్ అంటే ప్రపంచానికి తెలిసేలా చేశామన్నారు అమిత్ షా.



### ఉరీ, సర్జికల్ స్ట్రైక్

2014లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఉరీలో జరిగిన దాడి దేశాన్ని కలచివేసింది. ఈ దాడిలో భారత సైనికులను ఉగ్రవాదులు దారుణంగా హతమార్చారు. దీనికి సమాధానంగా భారత సైన్యం మొదటిసారిగా శత్రు భూభాగంలోకి చొచ్చుకెళ్లి సర్జికల్ స్ట్రైక్ నిర్వహించింది. ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేసింది. ఈ సర్జికల్ స్ట్రైక్ ప్రపంచవ్యాప్తంగా భారత సైన్యం శక్తిని చాటిచెప్పింది.

### పుల్వామా ఎయిర్ స్ట్రైక్

ఉరీ దాడి తర్వాత, 2019లో పుల్వామాలో మరో దాడి జరిగింది. ఈ దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సమాధానంగా భారత వైమానిక దళం ఎయిర్ స్ట్రైక్ నిర్వహించి, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్ ద్వారా భారత్.. సాయుధ బలగాల సామర్థ్యాన్ని మరోసారి నిరూపించింది.

### పహల్గామ్ దాడికి, ఆపరేషన్ సిందూర్

ఇటీవల పహల్గామ్‌లో పాకిస్థాన్ ఉగ్రవాదులు అమాయక పర్యాటకులను వారి మతం ఆధారంగా గుర్తించి హతమార్చారు. ఈ దారుణ ఘటనకు సమాధానంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు, ప్రధానమంత్రి మోదీ రాజకీయ దృఢత్వం కలిసి పనిచేశాయి. చివరకు ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తైంది. ఈ సందర్భంగా ప్రపంచం మొత్తం ఇప్పుడు భారత సైన్యాన్ని ప్రశంసిస్తున్నాయని షా వెల్లడించారు.

### బీఎస్ఎఫ్ పాత్ర

ఈ సందర్భంగా బీఎస్ఎఫ్‌ను అమిత్ షా మెచ్చుకున్నారు. భారతదేశానికి అత్యంత సవాలుతో కూడిన సరిహద్దులైన బంగ్లాదేశ్, పాకిస్థాన్ రక్షణ బాధ్యతను బీఎస్ఎఫ్‌కు అప్పగించినట్లు ప్రస్తావించారు. ఈ క్రమంలో బీఎస్ఎఫ్ ఆ బాధ్యతను అద్భుతంగా నిర్వర్తిస్తోందని అమిత్ షా అన్నారు. మీ సామర్థ్యంతో ఈ సరిహద్దులను గొప్పగా కాపాడారని షా కొనియాడారు. ఈ క్రమంలో ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం మరోసారి తన శక్తిని నిరూపించిందన్నారు. పహల్గామ్ దాడి తర్వాత, ప్రధానమంత్రి మోదీ తగిన సమాధానం ఇస్తామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఆ వాగ్దానాన్ని నెరవేర్చినట్లు చెప్పారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చిందన్నారు కేంద్రమంత్రి అమిత్ షా.

## కోటాలోనే విద్యార్థులు ఎందుకు చనిపోతున్నారు?



ఇంటర్నెట్ డెస్క్: రాజస్థాన్‌లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. కోటాలోనే ఇవి ఎందుకు చోటుచేసుకుంటున్నాయంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ ఏడాది ఇప్పటికే 14 మంది విద్యార్థులు బలవంతంగా ప్రాణాలు తీసుకోవడాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వంగా ఏం చేస్తున్నారంటూ నిలదీసింది. కోటా, ఐఐటీ ఖరగ్‌పుర్‌లకు చెందిన ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యల కేసులను విచారించిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం.. ఎఫ్ఐఆర్ నమోదులో పోలీసుల వైఖరిని తప్పుపట్టింది. ఐఐటీ ఖరగ్‌పుర్‌కు చెందిన విద్యార్థి (22) ఆత్మహత్యకు సంబంధించిన కేసును సుప్రీం విచారించింది. మే 4న హాస్టల్ గదిలో ఉరివేసుకొని మరణించగా.. పోలీసులు మాత్రం మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు నమోదుకు నాలుగు రోజులు ఆలస్యం ఎందుకు అయ్యిందని సంబంధిత పోలీసు అధికారిని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కేసులను తేలికగా తీసుకోవద్దని, చాలా తీవ్రత కలిగిన అంశాలని పేర్కొంది. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలకు సంబంధించి మార్చి 24న ఇచ్చిన తీర్పును ప్రస్తావించిన న్యాయస్థానం.. ఇటువంటి కేసుల్లో ఎఫ్ఐఆర్ త్వరగా నమోదుచేయడం ఎంతో ముఖ్యమని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పోలీసు అధికారి, ఐఐటీ ఖరగ్‌పుర్ తరఫు న్యాయవాది ఇచ్చిన వివరణలపై సుప్రీం ధర్మాసనం అసంతృప్తి వ్యక్తంచేసింది.

**పోక్సో చట్టం కింద దోషిగా తేలిన వ్యక్తికి ఏ శిక్షా వేయని సుప్రీంకోర్టు!**

కోటాలో నీట్‌కు సన్నద్ధమవుతోన్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకోగా.. ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. గతంలో న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ధిక్కరిస్తున్నారని, ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని నిలదీసింది. సంబంధిత పోలీసు అధికారి విధి నిర్వహణలో విఫలమయ్యారని, కోర్టు ఆదేశాలను ఆయన పాటించలేదని పేర్కొంది. దీనిపై జులై 14 సదరు పోలీసు అధికారి హాజరై వివరణ ఇవ్వాలని సమన్లు జారీచేసింది. "రాష్ట్ర ప్రభుత్వంగా ఏం చేస్తున్నారు? కోటాలోనే విద్యార్థులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు? ఈ విషయంపై ఎందుకు ఆలోచించడం లేదు? అని రాజస్థాన్ ప్రభుత్వం తరఫు న్యాయవాదిని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. ఇందుకు న్యాయవాది బదులిస్తూ.. ఆత్మహత్యల కేసులను పరిశీలించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.

## పాక్ ఆర్థిక వ్యవస్థపై దెబ్బకొట్టేందుకు భారత్ ప్రయత్నాలు

**ఇంటర్నెట్‌డెస్క్:**



పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆవేదనతో రగిలిపోయిన భారత్.. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్ లోని ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసింది. ఉగ్ర నాగులకు ఆశ్రయం కల్పిస్తున్న పాక్ పైనా చర్యలకు ఉపక్రమించింది. సింధు నది జలాల ఒప్పందం అమలును తాత్కాలికంగా నిలిపివేసింది. అఖిలపక్ష సభ్యులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, దాయాది చర్యలను తూర్పారబడుతూ.. దౌత్య మార్గాల్లోనూ ఒత్తిడి తీసుకొస్తోంది. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తే ఎలాంటి చర్యలకైనా వెనకాడబోమని పాకిస్థాన్‌కు పరోక్షంగా హెచ్చరికలు పంపుతోంది. ఈ క్రమంలోనే పాక్ ఆర్థిక మార్గాలను మూసివేసి, ఆ దేశ ఆర్థిక వ్యవస్థపైనా దెబ్బ కొట్టేందుకు భారత్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే దాయాదికి ఆర్థిక సాయం అందించే ప్రపంచ బ్యాంక్, ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎన్ఏటీఎఫ్)లను కలవాలని భారత్ యోచిస్తోంది. ప్రపంచ బ్యాంక్ 2 బిలియన్ డాలర్ల ఆర్థికసాయం చేస్తుందని పాక్ ఎన్నో ఆశలు పెట్టుకుంది. జూన్ నెలలో వరల్డ్ బ్యాంక్ దీనిపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో పహల్గాం దాడిని ఉటంకిస్తూ.. ప్యాకేజీపై పునరాలోచించాలని ప్రపంచ బ్యాంక్‌కు విజ్ఞప్తి చేసేందుకు భారత్ సిద్ధమవుతోంది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందన్న కారణంతో 2018 జూన్‌లో పాకిస్థాన్‌ను 'గ్రే జాబితా'లో చేర్చారు. దీంతో ప్రపంచ ఆర్థికసంస్థల నుంచి నిధులు మంజూరయ్యేవి కాదు. అయితే, ఉగ్రవాదం అణచివేతకు కృషి చేస్తామని హామీ ఇవ్వడమే కాకుండా.. ఉగ్రవాద సంస్థతో సంబంధం ఉన్న కొందరిని జైళ్లలో పెట్టడంతో.. 2022 అక్టోబర్‌లో పాక్‌ను ఆ జాబితా నుంచి తొలగించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో పాక్‌ను మళ్లీ గ్రే జాబితాలో చేర్చాలని ఎఫ్ఏటీఎఫ్‌పై భారత్ తీవ్రంగా ఒత్తిడి తీసుకొస్తోంది. ఒకవేళ పాక్‌ను మళ్లీ ఆ జాబితాలో చేరిస్తే.. ప్రపంచ బ్యాంకు నుంచి రావాల్సిన 2 బిలియన్ డాలర్ల ప్యాకేజీ ఆగిపోయే అవకాశం ఉంది. మరోవైపు ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎమ్ఎఫ్) సంస్థ పాకిస్థాన్‌కు మే 9న 1 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8,500 కోట్లు) ఆర్థికసాయం మంజూరు చేసింది. దీనిపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది.

## మహిళల హక్కుల్లో ప్రసూతి సెలవులు కీలకమైనవి..!



**ఇంటర్నెట్‌డెస్క్:** మహిళలకు ప్రసూతి సెలవులను దేశ అత్యున్నత న్యాయస్థానం మరోసారి సమర్థించింది. వారు మాతృత్వపు లబ్ధి, సంతానం పొందే హక్కుల్లో ఇవి అత్యంత కీలకమైనవని అభివర్ణించింది. ఏ సంస్థ స్త్రీలకు ఉన్న ప్రసూతి సెలవు హక్కును హరించలేదని న్యాయస్థానం వెల్లడించింది. తమిళనాడుకు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయినికి రెండో వివాహం అనంతరం బిడ్డకు జన్మనిచ్చేందుకు ప్రసూతి సెలవులను నిరాకరించారు. దీంతో ఆమె అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తన మొదటి వివాహం నుంచి ఇద్దరు బిడ్డలకు జన్మనివ్వడంతో.. తాజాగా మరోసారి ప్రసూతి సెలవులకు నిరాకరించినట్లు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్ర నిబంధనల ప్రకారం తొలి ఇద్దరు పిల్లలకు మహిళలు ప్రసూతి లబ్ధిని పొందే అవకాశం ఉంది. తాను రెండో వివాహం చేసుకొన్న అనంతరం ప్రభుత్వ ఉద్యోగంలో చేరినట్లు ఆ ఉపాధ్యాయిని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాదు.. తన రెండు కాన్పులకు ఎటువంటి ప్రసూతి సెలవులు వాడుకోలేదన్నారు. ఈ సందర్భంగా ఆమె తరఫున వాదిస్తున్న న్యాయవాది కేవీ ముత్తుకుమార్ స్పందిస్తూ.. ఆమె ప్రాథమిక హక్కులను హరించేలా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఉందని పేర్కొన్నారు.

# గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విధ్వంసం

-మొదటిపేజీ తరువాయి

ఈ నేపథ్యంలోనే శుక్రవారం రాత్రి ఢిల్లీలో మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు.

**గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఏపీ**

ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆయన మాట్లాడుతూ.. ‘ పోలవరంపై సీఆర్ పాటిల్‌తో చర్చించాం. 2027 మార్చి నాటికి పోలవరం పూర్తికి ప్రయత్నాలు చేస్తున్నాం. డయాఫ్రమ్ వాల్‌ను వైసీపీ ప్రభుత్వం నీళ్లలో కలిపేసింది. నాణ్యతలో రాజీపడకుండా పోలవరం నిర్మిస్తాం. బనకచర్ల ప్రాజెక్ట్‌తో ఎవరికీ అభ్యంతరం ఉండదు. బనకచర్ల ప్రాజెక్ట్‌కు రూ. 80 వేల కోట్లు ఖర్చు అవుతుంది. బనకచర్ల ప్రాజెక్ట్ ఏపీకి గేమ్ ఛేంజర్ అవుతుంది. సముద్రంలోకి వెళ్లే నీళ్లనే బనకచర్లకు మళ్లిస్తాం’ అని అన్నారు.

**విభజన చట్టంలో అమరావతి**

అమరావతిని విభజన చట్టంలో పెట్టాలని కేంద్రాన్ని కోరినట్లు సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 గురించి నీతి ఆయోగ్‌లో ప్రస్తావిస్తామన్నారు. ఏపీలో సైనిక కంటోన్మెంట్ పెట్టాలని కోరామన్నారు. సంపద సృష్టించాలంటే కొత్త విధానాలు తీసుకురావాలన్నారు. ఆర్థిక సాయం మాత్రమే కాదు.. అనుకూలమైన ప్రతిపాదనలు కూడా కావాలని అడిగినట్లు తెలిపారు.

**కేంద్రం అనుమతివ్వగానే పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు పనులు**

రాష్ట్ర విభజన జరిగి 10ఏళ్లు పూర్తయినందున అమరావతిని రాజధానిగా పునర్విభజన చట్టంలో పెట్టి నోటిఫై చేయాలని కేంద్రాన్ని కోరినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్రమంత్రులతో భేటీ అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. “2019-24 మధ్య ఏపీలో భారీగా విధ్వంసం జరిగింది. వైకాపా చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిన పెట్టాలంటే పదేళ్లు పడుతుంది. మా ప్రభుత్వం రాగానే రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అందుకు అనుగుణంగా అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. గత ప్రభుత్వం రూ.1.20లక్షల కోట్ల బిల్లులు చెల్లించకుండా బకాయిలు పెట్టింది. ఈ ఏడాదిలో రాష్ట్రానికి అత్యధికంగా పెట్టుబడులు



వచ్చాయి. దిల్లీకి వచ్చిన ప్రతిసారి ఏడుగురు కేంద్రమంత్రులను కలుస్తున్నా. సూర్యఘర్ కింద 35లక్షల కుటుంబాలకు విద్యుత్ ఇవ్వాలని ఆకాంక్షించాం. ఈ పథకం కింద ప్రతి నియోజకవర్గంలో 10వేల కుటుంబాలకు విద్యుత్ ఇస్తాం. సూర్యఘర్ అమలుకు మద్దతు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం. మా ప్రభుత్వం ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీ ప్రకారం 72 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయాలి. రూ.28,346 కోట్ల విలువైన గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఇవ్వాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కోరాం. అందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు.

**గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఏపీ..**

ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన రాజ్‌నాథ్‌సింగ్‌కు అభినందనలు తెలిపాను. జగ్గయ్యపేట-దోలకొండ క్లస్టర్‌లో 6వేల ఎకరాలు అందుబాటులో ఉంది. ఈ క్లస్టర్‌లో మిసైల్ అండ్ అమ్యూనేషన్ ప్రొటెక్షన్ కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరాం. లేపాక్షి-మడకశిర క్లస్టర్‌లో మిలిటరీ అండ్ సివిల్ ఎయిర్ క్రాఫ్ట్, ఎలక్ట్రానిక్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరాం. విశాఖ- అనకాపల్లి క్లస్టర్‌లో నేవల్ ఎక్స్‌పర్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరాం. కర్నూలు- ఓర్వకల్లు క్లస్టర్‌లో మిలిటరీ డ్రోన్లు, రోబోటిక్స్, అడ్వాన్స్ డిఫెన్స్ కాంపోనెట్స్ తయారీ చేయాలని కోరాం. తిరుపతి ఐఐటీలో డీఆర్‌డీవో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పెట్టాలని కోరాం. మా ప్రతిపాదనలకు కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో సైనిక కంటోన్మెంట్ పెట్టాలని కోరితే పరిశీలిస్తామని చెప్పారు. కుసుమ్ కింద 2వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి కేంద్రం అనుమతిచ్చింది. ఏపీ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారబోతోంది. గ్రీన్ ఎనర్జీ ద్వారా 24 గంటలూ విద్యుత్ సరఫరా చేసేందుకు వీలవుతుంది. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు రూ.80వేల కోట్లు ఖర్చవుతుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 200 టీఎంసీలను దారి మళ్లించవచ్చు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఇతర రాష్ట్రాలకు ఎలాంటి ఇబ్బంది లేదు. సముద్రంలో కలిసే నీళ్లను పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా తరలిస్తాం. కేంద్రం అనుమతి ఇవ్వగానే ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తాం. నిధులు ఇవ్వాలని ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌ను కోరాం” అని చంద్రబాబు తెలిపారు.

# డీఎస్సీలో ఒక్కో పోస్టుకు 25 మంది పోటీ

**విజయవాడ :** డీఎస్సీ పరీక్షా కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు జరుగుతోంది. గడువుకంటే ముందే పరీక్షలు పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. రోజుకి 40 నుంచి 50 వేల మందికి రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ఐయాన్ కేంద్రాలు ఎంపిక పూర్తయ్యింది.మెగా డీఎస్సీ-2025 పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మే 15వ తేదీతో ఆన్‌లైన్ అప్లికేషన్ల నమోదు గడువు పూర్తయిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మొత్తం ఎంత మంది అభ్యర్థులు పరీక్షలు రాయబోతున్నారన్న డేటా అధికారుల వద్ద ఉంది. దీంతో పరీక్ష కేంద్రాల ఎంపికపై దృష్టి సారించారు. రోజుకి సరాసరి 40 నుంచి 50 వేల మందికి ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. ఆ మేరకు కేంద్రాలను ఎంపిక చేస్తున్నారు.అధికారిక సమాచారం మేరకు.. ఇప్పటి వరకు అన్ని రకాల పరీక్ష కేంద్రాలు నిర్వహిస్తున్న టీసీఎస్ అయాన్ వారితో అధికారులు సంప్రదింపులు జరిపారు. జూన్ 6 తేదీ నుంచి జరగనున్న డీఎస్సీ పరీక్షలకు తమ కేంద్రాలను ఇచ్చేందుకు ఈ సంస్థ అంగీకరించింది. ఈ కేంద్రాలతోపాటు.. రాష్ట్రంలోని ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కళాశాలల్లో కూడా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వారితోకూడా సంప్రదింపులు జరిపారని తెలిసింది.డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి ఎలాంటి డీవియేషన్స్, షెడ్యూల్ మార్పులు లేకుండా.. అధికారులు ముందుకెళ్తున్నారు. వారి స్పీడ్ చూస్తుంటే.. పరీక్షల కోసం ఇచ్చిన 30 రోజుల షెడ్యూల్ కంటే ముందే పూర్తిచేసేలా ఉన్నారు. ఇప్పటికే టీసీఎస్ అయాన్ కేంద్రాలు ఎంపిక చేయగా.. వాటి సామర్థ్యం రోజుకి సరాసరి 20 వేల మందికి రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించగలరు. వీటితోపాటు ఇంజినీరింగ్ కళాశాలలు అందుబాటులోకి వస్తే.. మరో 20 నుంచి 30 వేల మందికి ఒకేరోజు పరీక్షలు జరిపే వెసులుబాటు ఉంటుంది. ఈ లెక్కన రోజుకి 40 వేల మంది చొప్పున చూసుకున్నా.. గరిష్టంగా 20 రోజులు కూడా పరీక్షల నిర్వహణకు ఎక్కువే అని అధికారులు చెబుతున్నారు.ఎస్సీ వర్గీకరణ ఈ డీఎస్సీ నోటిఫికేషన్ నుంచే అమలు చేస్తున్నారు. ఆ మేరకు పోస్టులను ప్రకటించగా.. ఎంత మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు అన్నది



కూడా అధికారులు తెలియజేశారు. ఎస్సీ జీఆర్ 1, జీఆర్ 2, జీఆర్ 3 కింద మూడు కేటగిరీల్లో వరుసగా.. 1,848, 45,419, 61,905 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేశారు. మొత్తం 16,347 ఉద్యోగాలకు 3,35,401 మంది అభ్యర్థులు వివిధ పోస్టులకు కలిపి 5,77,417 దరఖాస్తులను నమోదు చేశారు.ఒక్కో పోస్టుకు సరాసరి 35 మంది పోటీ పడనున్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్ల నమోదులో మహిళలు ముందంజలో ఉన్నారు. దాదాపు 2,03,647 మంది మహిళా అభ్యర్థులు, 1,31,754 మంది పురుషుల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు ఎస్సీఆర్టీ డైరెక్టర్, డీఎస్సీ కన్వీనర్ కృష్ణారెడ్డి వెల్లడించారు. ఈ నెల 30వ తేదీ నాటికి హాల్‌టికెట్లు విడుదల చేస్తామని ఆయన చెప్పారు.డీఎస్సీ పోస్టులు అధికంగా ఉన్న కర్నూలు జిల్లాలకు సంబంధించి అభ్యర్థుల నుంచి భారీగా దరఖాస్తులు నమోదయ్యాయి. మొత్తం 2678 పోస్టులు ఉండగా.. 39,997 మంది అభ్యర్థుల నుంచి మొత్తం 73,605 అప్లికేషన్లు వచ్చాయి. నెల్లూరు జిల్లాలో మొత్తం పోస్టులు 673 ఉండగా... 15,993 మంది అభ్యర్థుల నుంచి 28,772 అప్లికేషన్లు వచ్చాయి. ఇక్కడే అత్యల్పంగా దరఖాస్తులు వచ్చాయి. ఇతర రాష్ట్రాల నుంచి 7,159 మంది అభ్యర్థుల నుంచి 10,143 అప్లికేషన్లు వచ్చాయి.

# వినూత్న కార్యక్రమాలతో పవన్

**గుంటూరు :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జనంలోకి వెళ్లాలంటే కొంత ఇబ్బందులు తప్పవు. ఆయన ఇతర రాజకీయ నేతలు తరహా కాదు. సినీ హీరో కావడంతో పాటు లక్షలాది మంది అభిమానులు ఉండటంతో పవన్ కల్యాణ్ అంత సులువుగా జనంలోకి వెళ్లలేరు. ఏదైనా బహిరంగ సభలు, రోడ్ షోలకు మాత్రమే పరిమితమవుతారు. పాదయాత్ర వంటివి చేయాలన్నా ఆయనకు భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయి. వాహనంపై ఉన్నప్పటికీ అభిమానులు పోలీసు వలయాన్ని ఛేదించుకుని మరీ వచ్చి రచ్చ చేయడం అనేకసార్లు చూశాం. అభిమానుల తాకిడిని తట్టుకోవడం కూడా పవన్ కల్యాణ్ కు కష్టంగా మారి జనంలోకి రావడం అంటే పవన్ భయపడిపోతున్నారు. పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి కార్యక్రమాలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను ప్రత్యేకంగా వినియోగించుకోవడమే కాకుండా, తనకున్న పలుకుబడితో నిధులు తీసుకు రావడంతో గ్రామీణ రహదారులు మాత్రమే కాకుండా గిరిజన ప్రాంతాల్లో దశాబ్దాల నుంచి రోడ్డు సౌకర్యం లేక అల్లాడుతున్న ఏజెన్సీ ఏరియాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టారు. స్వయంగా గిరిజన ప్రాంతాలను దర్శించి వారితో చర్చించి సమస్యలను అడిగి తెలుసుకుని మరీ పరిష్కారం చేసే దిశగా పవన్ కల్యాణ్ అడుగులు వేస్తున్నారు. ఒక్క గిరిజన ప్రాంతాలకు మాత్రమే నేరుగా పవన్ కల్యాణ్ జనంలోకి వెళుతున్నారు. పంచాయతీలకు నిధులు మంజూరు చేయించి పల్లె పండగ పేరుతో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను సర్పంచ్ తో పాటు గ్రామ కమిటీలు కూర్చుని పరిష్కరించుకునేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పంచాయతీలకు ప్రభుత్వం చేత నిధులు విడుదల చేయించి విద్యుత్తు బకాయిలతో పాటు, రహదారులు, మంచినీటి సౌకర్యం వంటివి కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడింది. గత వైసీపీ పాలనలో పంచాయతీలను నిర్వీర్యం చేయడంతో సర్పంచ్ లు అప్పుల పాలయ్యారు. దీంతో పవన్ కల్యాణ్ పట్టుబట్టి మరీ చంద్రబాబు నాయుడును ఒప్పించి నిధులను పంచాయతీలకు విడుదల చేయించి పల్లె పండగను నిర్వహించారు. మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మన ఊరు-మాటామంతీ పేరుతో ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా పవన్ కల్యాణ్ ఈ కార్మక్రమానికి శ్రీకారం చుట్టారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నేడు శ్రీకాకుళం జిల్లా రావివలస ప్రజలతో పవన్ కల్యాణ్ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. మన ఊరు-మాటామంతీ కార్యక్రమం జరగనుంది. టెక్కలిలోని థియేటర్ ఇందుకు వేదిక కానుంది. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను నివేదించవచ్చు. అక్కడికక్కడే సమస్యలన పరిష్కరించేలా పవన్ కల్యాణ్ ప్లాన్ చేశారు. పవన్ కల్యాణ్ ప్రజల్లోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టడం శుభపరిణామమని అంటున్నారు.

## ఈ వ్యవహారాన్ని విడిచిపెట్టం’

**తాడేపల్లి :** హరికృష్ణకు పోలీసుల వేధింపులపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫైరయ్యారు. చంద్రబాబు సర్కారును ఎక్స్ వేదికగా ఎండగట్టారు. ‘పల్నాడు జిల్లా, దాచేపల్లి మండలం, తంగెడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎల్లయ్య కుమారుడు హరికృష్ణపై దాచేపల్లి పోలీసులు చేసిన దుర్మార్గం రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీని సూచిస్తోంది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే వారిపై హింసకు పాల్పడడం ఎంతవరకు సమంజసం? చట్టాన్ని చేతిలోకి తీసుకునే అధికారాన్ని వీరికి ఎవరు ఇచ్చారు?’ అంటూ వైఎస్ జగన్ నిలదీశారు. థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా? దాన్ని సమర్థించుకునేందుకు ఒక కట్టుకథ అల్లుతారా?.స్వయంగా టీడీపీ నేత కారులో హరికృష్ణను తరలించి, స్టేషన్‌లో తీవ్రంగా కొట్టి, సీఐ క్వార్టర్స్‌లో దాచిపెడతారా? హరికృష్ణ తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన చేయకపోతే అతన్ని ఏం చేసేవారు?. ఎవరి ఆదేశాలతో,ఎవరి అండతో ఈ దుర్మార్గాలన్నీ చేస్తున్నారు?. ఇది రాజ్య హింస కాదా?. ఇక పౌరులకు రక్షణ ఏముంటుంది?. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం కాదంటారా?. చట్టాన్ని, న్యాయాన్ని బేఖాతరు చేయడం కాదా?. ల చంద్రబాబు.. రెడ్‌బుక్ రాజ్యాంగంలో మీరు శిశుపాలుడి మాదిరి పాపాలు చేస్తున్నారు. ఇక ప్రజలు ఎంతమాత్రం సహించరు. ఈ అంశాన్ని అన్ని వ్యవస్థల దృష్టికీ తీసుకెళ్తాం. హరికృష్ణకు న్యాయం జరిగేంతవరకూ ఈ వ్యవహారాన్ని విడిచిపెట్టం’ అని వైఎస్ జగన్ చంద్రబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## రెండు రాష్ట్రాల రైతులకు మేలు చేయాలనేదే మా ఉద్దేశం

**హైదరాబాద్:** ఎర్రమంజిల్‌లోని పౌరసరఫరాలశాఖ భవన్‌లో తెలంగాణ, ఏపీ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్ భేటీ అయ్యారు. అనంతరం నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ.. వినియోగదారులకు మేలు రకమైన బియ్యం అందుబాటు ధరలో ఉండాలనేదే తమ ఉద్దేశమని చెప్పారు. ఏపీలో జూన్ 12 నుంచి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కింద సన్న బియ్యం అందించనున్నట్లు చెప్పారు. “ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు ఉండాలి. ఆస్తులు బదిలీ కావాల్సి ఉంది. 25వేల చ.అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఏపీ సివిల్ సప్లై భవన్‌ను పూర్తిగా తెలంగాణకు అప్పగిస్తున్నాం. తెలంగాణలో టెక్నాలజీలో జరుగుతోన్న మార్పులను మేం అందుకుంటాం. కాకినాడ నుంచి ఫిలిప్పిన్స్‌కు బియ్యం ఎగుమతి చేస్తున్నాం. దానికి అవసరమైన అన్ని సౌకర్యాలపై చర్చించాం. రెండు రాష్ట్రాల రైతులకు మేలు చేయాలనేదే మా ఉద్దేశం”అని మంత్రి నాదెండ్ల తెలిపారు. నాదెండ్ల ఆధ్వర్యంలోనే ఉమ్మడి ఏపీలో తెలంగాణ బిల్లు పాసైందని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గుర్తుచేశారు. ఆ క్రెడిట్ అప్పటి స్పీకర్‌గా ఉన్న నాదెండ్లకే ఇవ్వాలన్నారు. “ఇరు రాష్ట్రాల పౌరసరఫరా విధానాలు, ఉపయోగించే టెక్నాలజీ గురించి చర్చ జరిగింది. అంతర్రాష్ట్రాల మధ్య ధాన్యం అక్రమ రవాణా కట్టడి గురించి మాట్లాడాం. ఆస్తుల బదిలీపై కూడా చర్చించాం. రాష్ట్ర విభజనలో సివిల్ సప్లై బిల్డింగ్‌లో సగం ఏపీకి వెళ్లింది. జూన్ 1 నుంచి భవనం మొత్తం తెలంగాణకు అప్పగించనున్నారు. ఇకపై ఆహార, అనుబంధ శాఖలన్నీ ఈ కార్యాలయంలోనే ఉండనున్నాయి. శాంతి శిఖర అపార్ట్‌మెంట్‌లో 16 ఫ్లాట్స్ ఉన్నాయి. అవి తెలంగాణకే రాబోతున్నాయి.”అని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

## నోరు తెరుస్తున్న సీనియర్లు

-మొదటిపేజీ తరువాయి

ముఖ్య నేత జ్యోతుల నెహ్రూ చేసిన కామెంట్స్ ఇప్పుడు సంచలనంగా మారాయి.జనసేనకు అగ్ర తాంబూలం.. తూర్పుగోదావరి జనసేనకు పట్టున్న జిల్లా. ఆపై పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. డిప్యూటీ సీఎం గా సైతం ఉన్నారు. అందుకే అక్కడ జనసేనకు ఎనలేని ప్రాధాన్యం దక్కుతోంది. నామినేటెడ్ పదవుల్లో సైతం పెద్దపీట వేస్తున్నారు. జనసేనతో పోల్చుకుంటే టిడిపికి అక్కడ అవకాశాలు తగ్గాయి. దీనిని అక్కడ టిడిపి శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ముఖ్యంగా ద్వితీయ శ్రేణి నాయకత్వం తీవ్ర అసంతృప్తితో ఉంది. వారు నేరుగా ఎమ్మెల్యేల వద్ద తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలు సైతం కలవరపాటుకు గురవుతున్నారు.ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన మహానాడు కాకినాడలో జరిగింది. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అయితే తన మనసులో ఉన్న ఆవేదనను బయటపెట్టారు. కాకినాడ జిల్లాలో పదవులు ఏ పార్టీకి వెళ్లాయో ఆలోచించాలని సూచించారు. మెజారిటీ ఉన్న తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఏంటో ఆలోచించాలని వ్యాఖ్యానించారు. ఇటీవల జనసేనకు చెందిన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబుకు రెండు పదవులు ఇచ్చారు. పేరు పెట్టకుండా దానిని ప్రస్తావిస్తూ ఒక వ్యక్తికి రెండు పదవులు అవసరమా అని ప్రశ్నించారు. పార్టీ నిర్ణయాల వల్ల టిడిపి నిర్వీర్యం అయిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ఎన్నాళ్ళు ఉంటుంది.. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకోలేదని చెప్పుకొచ్చారు. ఎన్నిసార్లు బయటకు రాలేదు అంటూ వ్యాఖ్యానించారు. టిడిపి తో పొత్తు వల్ల కమ్యూనిస్టు పార్టీలు నిర్వీర్యం అయిపోయాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. అదే పరిస్థితి టిడిపికి రాకుండా చూడాలని జ్యోతుల నెహ్రూ వ్యాఖ్యానించారు. అయితే గత కొద్దిరోజులుగా జ్యోతుల నెహ్రూ పార్టీ పై అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అందులో భాగంగానే ఈ కామెంట్స్ చేసి ఉంటారన్న అనుమానాలు ఉన్నాయి.ఇంకోవైపు కాకినాడ టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ చేసిన కామెంట్ సైతం సంచలనంగా మారాయి. కాకినాడ రూరల్ నియోజకవర్గానికి టిడిపి ఇన్చార్జ్ ప్రకటించక పోవడాన్ని తప్పుపట్టారు. ఆ నియోజకవర్గంలో జనసేనకు భారీ మెజారిటీ లభించడం వెనుక టిడిపి కార్యకర్తలు ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యకర్తలను కాపాడుకో లేకపోతే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని కూడా వ్యాఖ్యానించారు. అయితే జనసేన విషయంలో సలహాలు ఇస్తూనే టిడిపి నేతలు సంచలన వ్యాఖ్యలు చేస్తుండడం కూటమిలో విభేదాలకు కారణమవుతోంది.

## టీడీపికి దూరంగా టాలీవుడ్

**ఏలూరు :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. రెండు సార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ, రెండు సార్లు విభజిత ఏపీలోనూ ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించారు. చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చి దాదాపు యాభై ఏళ్లు అవుతున్నప్పటికీ ఆయన కు తొలి నుంచిటాలీవుడ్ తో మంచి సంబంధాలున్నాయి. అసలు ఆ మాటకొస్తే తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు టాలీవుడ్ లో అగ్రస్థానంలో కొన్ని దశాబ్దాల పాటు వెలిగి చివరకు పార్టీ ని పెట్టి రాజకీయాల్లోకి వచ్చారు. దీంతో తెలుగుదేశం పార్టీకి, టాలీవుడ్ కు మధ్య సంబంధాలు దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్టీఆర్ హయాం నుంచి ప్రారంభమైన ఈ సంప్రదాయాన్ని చంద్రబాబు కూడా కొనసాగించారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా టాలీవుడ్ కు చెందిన వారిలో ఎవరో ఒకరు రాజ్యసభ లేదా పార్లమెంటు సభ్యులుగానో ఉండేవారు. ఎన్నికల ప్రచారంలోనూ టాలీవుడ్ నుంచి ఆయనకు సహకారం అందేది. చంద్రబాబు అంటే టాలీవుడ్ కు ప్రత్యేక అభిమానం ఉంది. అదే ఆయనను టాలీవుడ్ కు దగ్గర చేసింది. ఎన్నికల ప్రచారంలో దశాబ్దాల క్రితం సినిమాల్లో యాడ్స్ తో పాటు పాటలు వంటివి కూడా టాలీవుడ్ నుంచి వచ్చేవి. దర్శకులు, నిర్మాతలు, నటులు ఇలా 24 ఫ్రేమ్స్ నుంచి ఆయనకు వెన్నంటే ఉండేవారు. అలాగే ఆయన ఎప్పుడు అధికారంలోకి వచ్చినా టాలీవుడ్ నుంచి వచ్చి అందరూ కలిసేవారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కలసి అభినందనలుచెప్పి వెళ్లేవారు.. అంతేకాదు చంద్రబాబు కూడా వివిధ నామినేటెడ్ పోస్టుల్లో టాలీవుడ్ కుచెందిన వారిని నియమించేవారు. 2014 లో అధికారంలోకి వచ్చినప్పుడు కూడా ఎస్వీబీసీ ఛానల్ కు ఛైర్మన్ గా దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావును నియమించేవారు. నాడు మురళీ మోహన్ ఎంపీగా ఉండటంతో ఆయన అంతా తానే అయి టాలీవుడ్ ను చంద్రబాబు చెంతకు చేర్చేవారు. అలాగే రాజేంద్ర ప్రసాద్ వంటి నటులు కూడా వచ్చి చంద్రబాబును కలసి తమ సమస్యలను విన్నవించుకునే వారు. అలాంటిది కూటమి ప్రభుత్వం 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం టాలీవుడ్ నుంచి చంద్రబాబు వద్దకు వచ్చిన వారు తక్కువేననిచెప్పాలి. హైదరాబాద్ కు వచ్చినప్పుడు కలవడమే తప్ప ప్రత్యేకంగా అమరావతికి వచ్చి కలిసిన వారు ఎవరూ లేరు. దీనికి ప్రధాన కారణం జనసేన అధినేత పవన్ కల్యాణ్. టాలీవుడ్ ను శాసిస్తున్న మెగా కుటుంబానికి చెందిన పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా ఉండటం, సినిమాటోగ్రఫీ మంత్రిగా జనసేన ఎమ్మెల్యే కందుల దుర్గేశ్ కూడా ఉండటంతో చంద్రబాబు ఇక తనంతట తానే టాలీవుడ్ కు దూరమయినట్లు అంటున్నారు. పవన్ కల్యాణ్ అంటేనే టాలీవుడ్ కు చెందిన వారు కలుస్తారు.

## సంపాదకీయం

# గ్రీన్‌గ్యాస్‌కు గ్లోబల్ ట్యాక్స్

గ్లోబల్ వార్మింగ్ కట్టడికోసం గ్రీన్‌హౌస్ ఉద్గారాల (హరిత వాయువుల వెల్లువ)పై గ్లోబల్ ట్యాక్స్ విధించడానికి షిప్పింగ్ వనరుగా ఉన్న ప్రధాన దేశాలు అంగీకారం తెలిపాయి. దీని ప్రకారం నౌకలు విడుదల చేసే ప్రతి టన్ను కార్బన్ డైయాక్సైడ్‌పై ఇకనుంచి కనీసం 100 డాలర్ల వంతున పన్ను విధించనున్నాయి. ఆయా దేశాల నౌకలు లక్షాలను చేరలేకపోయినా, ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ నెట్ జీరో ఫండ్‌కు నిధులు అందించకున్నా 2028 నుంచి ఈ ట్యాక్స్‌ను వసూలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఏప్రిల్ 11న లండన్‌లో 60కి పైగా దేశాల ప్రతినిధులతో ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ (ఐఎంఒ) సమావేశం జరిగింది. అయితే అగ్రరాజ్యం అమెరికా మాత్రం దీనికి గైర్హాజరు కావడం గమనార్హం. ఓడల్లో వాడే ఇంధనానికి సైతం ఈ సమావేశం పలు ప్రమాణాలను నిర్దేశించింది. మొత్తం ఉద్గారాల్లో షిప్పింగ్ వాటా 3 శాతమని ఐక్యరాజ్యసమితి గణాంకాలు చెబుతున్నాయి. ఓడల సంఖ్యతోపాటు వాటి పరిమాణం పెరుగుతుండడం, అందుకు అనుగుణంగా ఇంధనవాడకం విపరీతంగా పెరిగిపోతుండటంతో రానున్న రోజుల్లో షిప్పింగ్ ఉద్గారాలు ఇంకా ఎక్కువవుతాయని భావిస్తున్నారు. ఐఎంఒ భేటీలో కుదిరిన ఒప్పందంపై సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగెజ్ హర్షం వెలిబుచ్చారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి షిప్పింగ్ ఆధునికీకరణకు ఎన్నో సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటూ ఈ బృందం అర్థవంతమైన ఏకాభిప్రాయాన్ని సాధించిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ వాణిజ్యానికి సముద్ర నౌకా రవాణా అన్నది వెన్నుముక వంటిది. ఏటా సుమారు 12 బిలియన్ టన్నుల సరకు నౌకలపై రవాణా అవుతుందని యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యుఎన్‌సిటిఎడి) 2023 నివేదిక వెల్లడిస్తోంది. 2022లో సముద్ర వాణిజ్యం 0.4 శాతం తగ్గినా, కంటైనర్ల ద్వారా రవాణా (2024 నుంచి కంటైనర్ల రవాణా ఏటా 3% పెరుగుతోంది) చమురు, గ్యాస్ రవాణా 2022 నుంచి క్రమంగా 6%, 4.6 శాతం పెరుగుతుండడంతో 2028 నాటికి మొత్తం సముద్ర వాణిజ్యం 2.1% నుంచి 2.2% వరకు పెరుగుతుందని అంచనా. ఈ విధమైన పెరుగుదల ఇంధన వాడకానికి మరింత ఆజ్యం పోస్తుంది. గత దశాబ్దకాలంగా షిప్పింగ్ ఉద్గారాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఏటా విడుదలయ్యే ఒక బిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్‌డైయాక్సైడ్ ఉద్గారాలు, 3% గ్లోబల్ గ్రీన్‌హౌస్ గ్యాస్‌తో సమానం. భారీ నౌకలు ప్రతి ట్రిప్పుకు ఎక్కువ సరకును రవాణా చేస్తుంటాయి. భారీ మొత్తంలో ఇంధనాన్ని మండిస్తుంటాయి. పనామా, లిబేరియా, మార్షల్ దీవుల్లో ఇదే పరిస్థితి. ప్రపంచం మొత్తం మీద రవాణా అయ్యే టన్నుల సరకుల్లో మూడోవంతు ఈ రేవుల ద్వారానే జరుగుతుంది. అంతే సమానంగా ఉద్గారాలు విడుదల అవుతుంటాయి. ఇంటర్నేషనల్ మారటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంఒ) 2023 సవరించిన గ్రీన్‌హౌస్ గ్యాస్ (జిహెచ్‌జి)వ్యూహం (స్ట్రాటెజీ) ఆశించే లక్షాలను నిర్దేశించింది. 2008 నాటి ఉద్గారాలస్థాయిలను ప్రామాణికంగా తీసుకుని 2030 నాటికి 20% నుంచి 30% వరకు ఉద్గారాలు తగ్గించాలని, 2050 నాటికి జీరో స్థాయికి చేరుకోవాలని నిర్దేశించింది. అయినప్పటికీ, ఎలాంటి చొరవ తీసుకోకుంటే ఉద్గారాలు మరింత ఎక్కువగా పెరుగుతాయని అంచనా వేశారు. యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ గుర్తించడం బట్టి భౌగోళిక రాజకీయ మార్పులు, ఉక్రెయిన్ యుద్ధం వంటి పరిణామాలు, మళ్లీ చమురు, ఆహార ధాన్యాల నౌకల రవాణా టన్నుల భారం కన్నా మరింత దూరం సాగేలా చేస్తున్నాయి. 2023లో చమురు రవాణా దూరంతోపాటు సుదీర్ఘకాలం సాగింది. ఐఎంఒ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ కమిటీ నిర్ణయించిన గ్లోబల్ కార్బన్ టాక్స్ మేరకు ఆయా లక్షాల నౌకలు నెట్ జీరో నిధులను అందించడం కానీ, లేదా ఉద్గారాల నియంత్రణ కానీ చేయలేకపోతున్నాయని వ్యాఖ్యానించింది. ఇది వాడుతున్న ఇంధన ప్రమాణాల బట్టి ఆధారపడి ఉంది. ఉద్గారాలను పూర్తిగా, లేదా కొంత స్థాయివరకు తగ్గించడానికి దోహదపడే హైడ్రోజన్, మెథనాల్, అమెనియా వంటి వాటిని ప్రోత్సహించడం అవసరం. ప్రకృతికి విరుద్ధమైన మానవ కార్యకలాపాల వల్ల భూమి వేడెక్కిపోతూనే ఉంది. 1850లో భూ ఉష్ణోగ్రతను నమోదు చేయడం మొదలైనప్పటి నుంచి అత్యుష్ణ సంవత్సరంగా 2023 రికార్డు సృష్టించగా, వెంటనే 2024 ఆ రికార్డును బద్దలు కొట్టింది. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఒ) గత జనవరిలో ఈమేరకు ఓ నివేదిక విడుదల చేసింది. అసలు గడచిన పదేళ్లు భూమిపై గత 125000 ఏళ్లలోనే అత్యుష్ణ సంవత్సరాలని ఐరోపా, బ్రిటన్, జపాన్ దేశాల వాతావరణ సంస్థలు నిర్ధారించాయి. బొగ్గు, చమురు ఆధారిత పారిశ్రామిక విప్లవం వచ్చినప్పటి నుంచి భూ ఉష్ణోగ్రత పెరుగుతూ వస్తోంది. ఈ పెరుగుదల 1.5 సెల్సియస్ డిగ్రీలకు (2.7 ఫారన్ హీట్) మించకుండా చూడాలని 2015లో పారిస్ వాతావరణ సభ తీర్మానించింది. కానీ ఈ ఏడాది భూ ఉష్ణోగ్రత ఆ పరిమితిని మించి 1.6 సెల్సియస్ డిగ్రీలకు పెరిగిందని ఐరోపా కమిషన్‌కు చెందిన కొపెర్నికస్ వాతావరణ విభాగం తెలిపింది. జపాన్ ఈ పెరుగుదలను 1.57 డిగ్రీలుగా, బ్రిటన్ 1.53 డిగ్రీలుగా లెక్కగట్టాయి. వాతావరణ మార్పుల వల్ల వరదలు, తుపానులు, అనావృష్టి తలెత్తి గత ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 14,000 కోట్ల డాలర్ల నష్టం జరిగింది. శిలాజ ఇంధనాలైన బొగ్గు, చమురు, సహజ వాయువులను మండించడం వల్లనే వాతావరణంలో కర్బనం పెరిగి ఉష్ణోగ్రతను పెంచుతోంది. పారిశ్రామిక విప్లవంనుంచి సంపన్న ఐరోపా, అమెరికా ఖండ దేశాలు శిలాజ ఇంధనాలను మండించడం ద్వారా ప్రపంచానికి 170 లక్షల కోట్ల డాలర్ల నష్టం కలిగించాయి. ఈ నష్టాలను అధిగమించడానికి వర్ధమాన దేశాలకు లక్షల కోట్ల డాలర్ల సహాయం చేయాల్సిన సంపన్న దేశాలు కేవలం 30,000 కోట్ల డాలర్లను అదీ 2035 కల్లా విదిలిస్తామని ప్రతిపాదించాయి. భూగోళం వేడెక్కడ మనేది కఠోరమైన వాస్తవమని డబ్లుఎంఒ తాజా నివేదిక మరోసారి రుజువు చేస్తోందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. భూతాపం పెరగడం మాతాశిశు ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తోంది. వేడి ఎక్కువగా ఉండే రోజుల సంఖ్య పెరుగుతున్నందున నెలలు నిండక ముందే శిశు జననాలు సంభవిస్తున్నాయి. తల్లులకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. 202024 మధ్య కాలంలో 247 దేశాలు, 940 నగరాల్లో అధిక వేడిరోజులు రెట్టింపు అయ్యాయని తేల్చారు. గడిచిన అయిదేళ్లలో భారత్‌లో గర్భిణులకు ప్రమాదకరమైన రీతిలో జాతీయ స్థాయిలో ఏటా సగటున ఆరు అదనపు అత్యుష్ణ రోజులు నమోదైనట్టు నివేదికలు చెబుతున్నాయి.

# రాజీలేని పోరాట యోధుడు



తెలంగాణ ప్రాంతం దశాబ్దాల కాలం నుండి ఉద్యమాలకు ఆలవాలం. నిరంకుశ వాదంపై అలుపెరుగని పోరాటం చేసిన కార్యస్థలం. నిజాం రాచరిక పాలన సాగుతున్న ఆ రోజుల్లో ప్రజలు బానిసలుగా బతికేవారు. నరకం చూసేవారు. ఖాసీం రజ్వీ అనుచరుల అకృత్యాలకు అడ్డూ అదుపూ లేకుండా ప్రజల ధన, మాన ప్రాణాలకు రక్షణ కరువైన దుస్థితి. తెలంగాణ పల్లెల్లో ఒకవైపు భూస్వాములు, రజాకార్ల ఆకృత్యాలపై సాయుధ దళాలు దాడులకు దిగుతుంటే.. మరోవైపు సింగరేణి బొగ్గు గనుల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులు కార్మికుల్లో చైతన్యాన్ని కలిగించాయి. ఈ ప్రాంతంలోని దేవులపల్లి శేషగిరి రావు అనే వ్యక్తి ఇల్లందు, కొత్తగూడెం కేంద్రాలుగా బొగ్గు గని కార్మికుల్లో పోరాట చైతన్యాన్ని నింపారు. నిజాం కాలంలోనే కార్మికులను రహస్యంగా సంఘటిత పరిచి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ను స్థాపించారు. భూస్వాములు, పోలీసుల దాడులను తిప్పికొట్టేందుకు శేషగిరిరావు సాయుధ దళానికి నాయకత్వం వహించారు. సాయుధ దళంతో భద్రాచలం ఏరియాలోని నెల్లిపాక అడవుల మీదుగా మణుగూరు వెళ్తున్న క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో శేషగిరి దళం నామ రూపాలు లేకుండా పోయింది. ఉద్యమ కారుడు శేషగిరిరావు కాల్చి చంప బడినపుడు శేషగిరి రావు పేరులోని గిరిని తన పేరు ముందుంచుకుని నల్లమల ప్రసాద్, నల్లమల గిరిప్రసాద్‌గా మారి గిరి దళాన్ని ముందుకు నడిపాడు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం పల్లెలకు పరిమితం కాలేదు. బొగ్గు గనుల్లో దుర్భర జీవితాలు అనుభవిస్తున్న కార్మికులు కూడా ఉద్యమంలో పాల్గొన్నారు. ముఖ్యంగా నిజాంకు ముఖ్య అనుచరుడిగా ఉన్న ఖాసీం రజ్వి అనుచరుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మడిమ తిప్పని పోరాటాలు కొనసాగించారు. గార్ల, బయ్యారం, ఇల్లందు ప్రాంతాల్లో నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఈ ప్రాంతం మధిర నియోజకవర్గం పరిధిలోకి వచ్చేది. అప్పట్లో మధిర వరంగల్ జిల్లాలో భాగస్వామ్యంగా ఉండేది. మధిర నియోజకవర్గం లోని ప్రతి ఊరు ఆనాటి నిజాం కు వ్యతిరేకంగా పోరాడింది. ప్రధానంగా ఆంధ్ర ప్రాంతంలో బ్రిటిష్ ప్రభుత్వం ఉండడంతో అక్కడి పోరాట ప్రభావం మధిరపై కనిపించేది. ఫలితంగా కమ్యూనిస్టులు ఇక్కడ ఆంధ్ర మహాసభ పేరుతో పెద్ద ఎత్తున ఉద్యమాలు నడిపారు. మధిర లోని అల్లినగరంలో ప్రారంభమైన ఉద్యమం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాంది అని చరిత్రకారుల భావన. కమ్యూనిస్టు పార్టీ నేతలు నల్లమల గిరిప్రసాద్, బొమ్మకంటి సూర్యనారాయణ, మల్లు స్వరాజ్యం ఆధ్వర్యంలో ఆనాడు క్యాంపులు నిర్వహించారు. అలా ఆనాటి ప్రజా ఉద్యమాలతో విడదీయ జాలని సంబంధం, అనుబంధం కలిగి ఉన్నాడు నల్లమల గిరి ప్రసాద్. ఖమ్మం శాసనసభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా, స్వాతంత్ర్య సమరయోధుల స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ గా, విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షుడిగా, భారత కమ్యూనిస్టు పార్టీ అఖిల భారత డిప్యూటీ జనరల్ సెక్రటరీగా, తెలంగాణ సాయుధ పోరాట యోధునిగా పేరెన్నిక గన్న భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం మచ్చలేని మహా నాయకుడు నల్లమల గిరిప్రసాద్. ఖమ్మం జిల్లా, మధిర మండలం, తొండల గోపవరం గ్రామంలో ఏప్రిల్ 6, 1931లో నల్లమల ప్రసాద్ జన్మించాడు. మద్రాస్ కళాశాలలో చదివే సమయంలో ఆంధ్రా మహాసభ కార్యకలాపాల పట్ల ఆకర్శితులయ్యాడు. 1947లో చదువుకు స్వస్తిచెప్పి ఆంధ్రా మహాసభలో, తర్వాత కమ్యూనిస్టుపార్టీలో చేరాడు. నిజాం రాక్షస రజాకారుల మూకలు గ్రామాలపై పడి బీభత్సకాండ జరుపుతుండగా ప్రజలు తిరబడి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో తుపాకి చేతబట్టి సాయుధుడయ్యాడు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకుడు శేషగిరిరావును కాల్చి చంప బడినపుడు "శేషగిరి రావు" పేరులోని "గిరి"ని తన పేరు ముందుంచుకుని నల్లమల ప్రసాద్, నల్లమల గిరిప్రసాద్‌గా మారి గిరి దళాన్ని నడిపాడు. సాయుధ పోరాటం అనంతరం ఐదు సంవత్సరాల అజ్ఞాత జీవితం గడిపాడు. 1953లో అప్పటి ప్రభుత్వం గిరిప్రసాద్‌పై అనేక కేసులు నమోదుచేసి జైలుకు పంపగా, ఆ కేసులలో ఏదీ రుజువు కాలేదు. గిరి ప్రసాద్ 1953లో ఉద్యమ కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా ఎన్నికై 11 సంవత్సరాల పాటు కొన సాగాడు. 1962లో ఖమ్మం నుండి శాసన సభ్యునిగా ఎన్నికయ్యాడు. కమ్యూనిస్టు పార్టీ చీలిక సమయంలో సిపిఐ బలమైన రాజకీయ శక్తిగా ఎదిగేందుకు విశేష కృషి చేశాడు. 1978లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై 1991 వరకు పని చేశాడు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షునిగా, 1992నుంచి రాజ్యసభ సభ్యుడుగా పనిచేశాడు. 1992లో సి.పి.ఐ. జాతీయ కార్యదర్శిగా, 1996లో ఉప ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. స్వాతంత్ర్య సమరయోధుల స్క్రీనింగ్‌కమిటీ చైర్మన్‌గా పనిచేశాడు. కమ్యూనిస్టు సిద్ధాంతాలకు జీవితాంతం కట్టుబడిన నల్లమల గిరిప్రసాద్ 1997, మే 24 న ఈ లోకాన్ని వదిలి వెళ్ళాడు.

# అలంకారప్రాయంగా కామన్వెల్త్



కామన్వెల్త్ అనేది.. ఆయా దేశాలు ఎలాంటి లాంఛనప్రాయమైన కట్టుబాట్లు లేకుండా.. సుహృద్భావంతో స్నేహపూర్వకంగా చారిత్రక సంబంధాలను కొనసాగిస్తూ కలిసివుండటానికి గల ఒక మార్గం. కామన్వెల్త్... ప్రపంచంలోని మూడోవంతు జనాభా గల దేశాల కూటమి. ఎన్నో మతాలు, జాతులు, భాషలు, సంస్కృతుల వారు ఇందులో భాగంగా ఉన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యం దాని వలస రాజ్యాల స్థాపన ప్రక్రియను ప్రారంభించినప్పుడు, మాజీ బ్రిటిష్ కాలనీల నుండి స్వతంత్ర రాష్ట్రాల ఏర్పాటుకు, గతంలో సామ్రాజ్యంలో భాగమైన దేశాల సంస్థ యొక్క అవసరం ఏర్పడింది. కామన్వెల్త్ దినోత్సవాన్ని అంతకు ముందు 'ఎంపైర్ డే' అని పిలిచేవారు. అప్పటి రాయల్ కామన్వెల్త్ సొసైటి అయిన రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్ కెనడియన్ శాఖ 'ఎంపైర్ డే 'జరపాలన్న సూచన చేసింది. ఈ ప్రతిపాధనను 1898 లో కెనడియన్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సమావేశంలో ప్రవేశ పెట్టగా ఏకగ్రీవంగా అమోదించారు. అలా 'ఎంపైర్ డే ' ఓ జాతీయ కార్యక్రమమైనది. 1884లో, లార్డ్ రోజ్‌బెరీ అనే బ్రిటిష్ రాజకీయ నాయకుడు మారుతున్న బ్రిటిష్ సామ్రాజ్యాన్ని "కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్" గా అభివర్ణించాడు. ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలో బ్రిటిష్ వలస పాలనలోని పలు దేశాలు స్వాతంత్ర్యం పొందటం ప్రారంభమైంది. ఆ క్రమంలో ఆయా దేశాలకు బ్రిటన్‌కు మధ్య.. ఆయా దేశాల మధ్య సంబంధాలు ఎలా ఉండాలనేందుకు ఒక రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థ అవసరమైంది. 1916 మే 24 వ తేదీన యునైటెడ్ కింగ్డమ్ లో తొలిసారిగా 'ఎంపైర్ డే' ను దేశవ్యాప్తంగా జరుపుకున్నారు . 70 వేల స్కూళ్ళు , స్టాక్ ఎక్షేంజ్ వంటి సంస్థలు జెండా వందనం చేసి జాతీయ గీతంను ఆలపించారు. 1921 జనవరిలో 'ఎంపైర్ డే ' ఉద్యమాన్ని వీలైనంతగా ముందుకు తీసుకువెళ్ళాలని భావించిన ' మీథ్ రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్ ను లాంచనంగా అహ్వానించారు. ఇన్స్టిట్యూట్ సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ, మీథ్ బృందము కలిసి ఉద్యమ కార్యక్రమాలను రూపొందించారు. 1927 నుండి 1929 వరకు ఉద్యమ తొలి అద్యక్షుడుగా మీథ్ కొనసాగాడు. 1901 లో మరణించిన క్వీన్ విక్టోరియా జన్మదినం అయిన మే 24 వ తేదీన ఏటా 'ఎంపైర్ డే' నిర్వహించాలని నిర్ణయించారు. అలా 1931లో 'బ్రిటిష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్' ఏర్పడింది. 1931 లో, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, ఐరిష్ ఫ్రీ స్టేట్, న్యూఫౌండ్లాండ్, యూనియన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికాతో... ఐదు ప్రారంభ సభ్యులతో బ్రిటిష్ కామన్వెల్త్ నేషన్స్ వెస్ట్ మినిస్టర్ శాసనం క్రింద స్థాపించ బడింది. 1931లో 'బ్రిటిష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్' ఏర్పడగా, . 1949లో ఆ పేరు నుండి 'బ్రిటిష్' పదాన్ని తొలగించారు. ఆ కూటమిలో చేరటమనేది ఆయా దేశాల ఇష్టాయిష్టాల మేరకే జరుగుతుంది. అలా 53 దేశాలు ఇందులో సభ్యులుగా చేరాయి. చివరిగా చేరిన మొజాంబిక్, రువాండాలకు బ్రిటిష్ వలసరాజ్యంతో ఎలాంటి సంబంధం లేదు. బ్రిటిష్ వలస పాలన నుంచి విముక్తమైన దేశాల కూటమిగా అది మారింది. ఆధునిక కామన్వెల్త్ కూటమి మొదట ఆస్ట్రేలియా, కెనడా, భారత్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, యూకేలు సభ్య దేశాలుగా స్వతంత్ర దేశాల 'ఫ్రీ అసోసియేషన్' పేరుతో అది ఏర్పడింది. ఆ తరవాత అది 'కామన్వెల్త్ నేషన్స్'గా రూపాంతరం చెందింది. కామన్వెల్త్ కూటమిలో భాగమైన అత్యధిక దేశాలు బ్రిటిష్ సామ్రాజ్య పాలనతో ఏదో విధంగా సంబంధం ఉన్నవే. రవాండా, మొజాంబిక్ లాంటి దేశాలు మాత్రమే వాటికి అతీతం. రవాండా 2009లో, మొజాంబిక్ 1995లో కామన్వెల్త్ దేశాల కూటమిలో భాగమయ్యాయి. అవి గతంలో బ్రిటిష్ పాలనలో లేవు. ప్రపంచ దేశాలన్నింటి విస్తీర్ణంలో పావు భాగాన్ని కామన్వెల్త్ దేశాలే ఆక్రమిస్తున్నాయి. విస్తీర్ణం పరంగా కెనడా కామన్వెల్త్ కూటమిలో తొలిస్థానంలో, ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా, భారత్‌లు కూడా విస్తీర్ణం పరంగా చాలా పెద్దవి. సమోవా, టువాలు, ఆంటిగ్వా లాంటి చిన్న దేశాలు కూడా కూటమిలో భాగంగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచ జనాభా దాదాపు 8.2 బిలియన్ ప్రజలు ఉన్నారు. 2024లో, ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం ఇది 8.1 బిలియన్లకు చేరుకుందని పేర్కొంది, ప్రపంచ జానాభాలో మూడో వంతు ప్రజలు కామన్వెల్త్ కూటమిలో భాగమైన 53 దేశాల్లోనే జీవిస్తున్నారు. ఈ దేశాల్లో ఎక్కువమంది 30 ఏళ్ల లోపువారే. ఈ కూటమిలో జనాభా పరంగా భారతే అతిపెద్ద దేశం. మొత్తం కామన్వెల్త్ కూటమి దేశాల జనాభాలో సగం భారత్‌లోనే ఉంది. కూటమిలోని 31 దేశాల జనాభా 16 లక్షల కంటే తక్కువే. 2012 దాకా కామన్వెల్త్ కూటమికి ఎలాంటి రాజ్యాంగం లేదు. ఆ తరవాతే ప్రజాస్వామ్యం, లింగ సమానత్వం, శాంతి, భద్రత లాంటి 16 విలువలకు సభ్య దేశాలు కట్టుబడి ఉండాలని తీర్మానించుకున్నాయి. కామన్వెల్త్ సెక్రటేరియట్ లండన్‌లో ఉంది. విద్యా రంగం నుంచి పట్టణ ప్రణాళిక వరకూ అనేక రంగాల్లో కామన్వెల్త్ సంస్థలు కృషి చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆయా దేశాల్లో ఎన్నికలు సక్రమంగా జరిగేలా చూసేందుకు పరిశీలకులు కూడా హాజరవుతుంటారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇతర దేశాల మీద ఆ కూటమి చూపే ప్రభావం ఏదీ లేదనే చర్చ ఉంది. సభ్య దేశాల మధ్య వాణిజ్య సంబంధాల కోసం కామన్వెల్త్ చేస్తున్నదేమీ లేదు. ఇందుకోసం అన్ని దేశాలూ ఏదో ఒక ప్రాంతీయ కూటమి లోనో అంతర్జాతీయ కూటమి లోనో భాగస్వాములుగా ఉన్నాయి. కామన్వెల్త్ అనేది రెండేళ్ల కోసారి కామన్వెల్త్ దేశాల రాజకీయ అధినేతల సమావేశం, నాలుగేళ్లకోసారి కొన్ని పతకాల కోసం క్రీడలను నిర్వహించే అలంకార ప్రాయమైన సంస్థగా మిగిలిపోతున్నదనే విమర్శలు కూడా లేక పోలేదు

# దైవిక పాత్రలకు జీవంపోసిన నటుడు

టి.ఎస్. విజయ చందర్ తెలుగు నాటక, సినిమా, టెలివిజన్ రంగాల్లో విశిష్టతను సంపాదించుకున్న గొప్ప కళాకారుడు. నటుడు, దర్శకుడు, నిర్మాతగా ఆయన ప్రస్థానం ప్రతి దశలోను విలక్షణతను చాటింది. 1939 మే 24న ఆంధ్ర ప్రదేశ్‌లో జన్మించిన ఆయన, చిన్ననాటి నుంచే కళలకు ఆసక్తితో ఎదిగారు. కుటుంబ నేపథ్యం కూడా ఆయనకు స్ఫూర్తి దాయకమే. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఈయనకు తాత అవుతారు. విజయచందర్ తల్లి పుష్పావతి, ప్రకాశం పంతులు కూతురు. తండ్రి తెలిదేవర వెంకట్రావు హెూమియోపతి వైద్యుడు. బ్యాడ్మింటన్ ఛాంపియన్ కూడా. అంతేగాక ప్రసిద్ధ గాయని టంగుటూరి సూర్యకుమారి కూడా ఆయనకు సమీప బంధువు. విజయచందర్ సినీ రంగంలోకి అడుగుపెట్టిన చిత్రం 'సుడి గుండాలు (1967), అదే సంవత్సరానికి ఉత్తమ తెలుగు ఫీచర్ ఫిల్మ్‌గా జాతీయ అవార్డు అందుకుంది. నటుడిగా మాత్రమే కాక, ఒక ఆలోచనాత్మక కళాకారుడిగా ఆయన చూపిన ప్రావీణ్యం తర్వాతి చిత్రాలలో స్పష్టంగా కనపడింది. 1978లో నిర్మించిన 'కరుణా మయుడు' చిత్రం ద్వారా ఆయనను తెలుగు ప్రేక్షకులు పూర్తిగా గుర్తించారు. యేసు క్రీస్తు పాత్రలో ఆయన హృద్య నటన, ఆత్మీయమైన భాష్యం ప్రేక్షకులను ఆధ్యాత్మికంగా ప్రభావితం చేసింది. ఈ చిత్రాన్ని ఆయన నిర్మాతగా నిర్మించారు. అది తెలుగుతోపాటు తమిళం, మలయాళంలో కూడా విడుదలై విజయవంతమైంది. ఆయన ప్రతిభను, పూర్వీకుల జీవితాల రూపకల్పన లో మనం గమనించ వచ్చు. 1982లో విడుదలైన 'ఆంధ్ర కేసరి' చిత్రంలో ఆయన టంగుటూరి ప్రకాశం పంతులు పాత్రను పోషించడం మామూలు విషయం కాదు. ఆ పాత్రకు ఆయన కలిగిన వ్యక్తిగత అనుబంధం, పరిశోధనాత్మకత, నటనలోని గంభీరత చిత్రాన్ని చారిత్రకంగా నిలిపాయి. ఈ చిత్రానికి రచయిత, దర్శకుడు, నిర్మాతగా కూడా ఆయన సేవలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రూపొందిన ఈ చిత్రం ప్రత్యేక జ్యూరీ పురస్కారం అందుకుంది. 1986లో వచ్చిన 'శ్రీ షిర్డీ సాయిబాబా మహత్యం' చిత్రంలో ఆయన పోషించిన సాయిబాబా పాత్ర అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శించబడిన స్థాయికి చేరింది. ఆయన నటన భక్తిని రేకెత్తించేలా ఉండి, ప్రేక్షకులను ఆధ్యాత్మిక భావనల్లో తేలి యాడించింది. ఆయనకు "దైవిక పాత్రల పోషణలో నిపుణుడు" అనే పేరు ఈ చిత్రాల వల్లే వచ్చినదని చెప్పవచ్చు.

# ప్రతి శుక్రవారం డ్రైడే పాటించండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి





**సబ్ యూనిట్ ఆఫీసర్, టీ. నరసింహ రెడ్డి**

**బద్వేల్ మే 23 (ప్రజా జ్యోతి న్యూస్)** స్థానిక పట్టణ పరిధిలోని కోటవీధి ఆరోగ్య కేంద్రం పరిధిలో అబ్బ రాతి వీధి వార్డు సచివాలయం నందు ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సబ్ యూనిట్ ఆఫీసర్ టీ. నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నీటి నిలువ ఉన్న తొట్లు మరియు సంపులను ఒక అరగంట శుభ్రం చేసి ఆరబెట్టి మరల నీళ్లు పట్టుకోవాలన్నారు. ఈ విధంగా చేయటం వల్ల దోమల ద్వారా వచ్చు అంటువ్యాధులైన డెంగ్యూ మలేరియా చికెన్ గున్యా జ్వరాలు నివారణ చేసుకోవచ్చని, మరియు పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకొని వ్యక్తిగత పరిశుభ్రతను పాటించుట వలన మన చేతిలోనే మన ఆరోగ్యం ఉంటుందన్నారు. కావున ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించి అంటువ్యాధులకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి వెంగయ్య మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత పైన మరియు వర్షపు నీళ్లు నిలువ ఉన్నటువంటి గుంతలు పాత బడిన వస్తువులను మరియు టెంకాయ బొండాలు పాతబడిన డ్రమ్ములు రోలు ఇంట్లో ఉన్నట్టు వాడుతున్నటువంటి ఫ్రిడ్జ్ కూలర్స్ ను వారానికి ఒక్కసారి శుభ్రం చేసుకుని నీళ్లు పట్టినట్లయితే దోమల ద్వారా వచ్చు అంటువ్యాధులు అయినటువంటి మలేరియా, డెంగ్యూ ఫైలేరియా,మెదడువాపు వ్యాధులను రాకుండా నివారించవచ్చున్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలి అదేవిధంగా రాత్రి టైం లో వేపాకు పొగ పెట్టుకోవడం వలన దోమలు కుట్టకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో చంద్రావతి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్. ఏఎన్ఎం బి రెడ్డమ్మ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించేవారిపై ఉక్కుపాదం

**జిల్లా ఎస్పీ తుషార్ డూడి...**

**బాపట్ల మే 23 (ప్రజాజ్యోతి జిల్లా స్టాంప్ రిపోర్టర్)** బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై ఉక్కుపాదం మోపుతున్నట్లు బాపట్ల జిల్లా పోలీసులు స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు గురువారం రాత్రి చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో జిల్లావ్యాప్తంగా 51 మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ కూడా నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్ట విరుద్ధమే కాక, సమాజ శాంతిభద్రతలపై తీవ్రమైన ప్రభావం చూపుతోందన్నారు. మద్యం మత్తులో ప్రజలతో అసభ్యంగా ప్రవర్తించడం, గొడవలు, దౌర్జన్యం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. చిన్న తగాదాలు పెద్ద నేరాలుగా మారే ప్రమాదం ఉందన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో మద్యం సేవించడం మహిళలు, పిల్లలు, కుటుంబాలతో బయటికి వెళ్లే ప్రజలలో భయాందోళనలు కలిగిస్తున్నదని పేర్కొన్నారు. 2025 జనవరి నుండి ఇప్పటి వరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 2550 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇటువంటి చర్యల నిరోధానికి నిఘా భాగంగా డ్రోన్లను కూడా వినియోగిస్తున్నామని వెల్లడించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిని ఉపేక్షించబోమని, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎక్కడైనా ఇటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనించినట్లయితే సమీప పోలీస్ స్టేషన్ లేదా టోల్ ఫ్రీ నంబర్లు 100 / 112 కు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని చెప్పారు.




# కవిత లేఖ ఉత్తదే



**హైదరాబాద్:** వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్–బీజేపీలు కలిసి పోటీ చేస్తాయనే ఊహాగానాలు తెలంగాణ రాజకీయాలను కాస్త హీటెక్కించాయి. అయితే అది ఎట్టి పరిస్థితుల్లో జరగబోదని ఇరు పార్టీలు తేల్చేశాయి. ఈలోపు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు ఆయన కుమార్తె, ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖ కలకలం రేపింది. అయితే ఈ లేఖపై కవిత లేఖపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. కేసీఆర్ కుటుంబం మరో డ్రామాకు తెరలేపిం దన్నారు. "కవిత లేఖ ఉత్తదే. కేసీఆర్‌కు సలహా ఇచ్చే స్థాయిలో కవిత ఉందా?. బీజేపీ పై ఎంతసేపు మాట్లాడాలో కవిత డిసైడ్ చేస్తదా?. కేటీఆర్ హరీష్ రావులే ఈ లేఖ తయారు చేయించారు. కవిత పేరుతో బయటకు వదిలారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కలసి పోటీ చేయడం ఖాయం. ఈ లేఖతోనే బీజేపీ, బీఆర్ఎస్ బంధం బయటపడింది. వరంగల్ సభతో బీఆర్ఎస్ పని అయిపోయిందని తేలిపోయింది. అందుకే ఈ డ్రామాలు" అని అన్నారాయన. మరోవైపు.. కేసీఆర్ కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ కీలక నేతలు స్పందించేందుకు నిరాకరించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కవిత లేఖపై స్పందించాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీనియర్ నేత హరీష్‌రావును మీడియా కోరగా.. ఇద్దరూ స్పందించలేదు. ఓ కార్యక్రమానికి హాజరైన కేటీఆర్ మైక్‌ను పక్కకు తోసేయగా.. హరీష్‌రావు మాత్రం కవిత లేఖపై త్వరలో స్పందిస్తామంటూ హడావిడిగా కారెక్కి వెళ్లిపోయారు.

కిందటి నెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ ధూం ధాం సభ సక్సెస్ అయ్యిదంటూనే.. అది పార్టీ కార్యకర్తలను ఆకట్టుకోలేకపోయిందంటూ కొన్ని ప్రతికూల పాయింట్లను ఆమె లేఖలో ప్రస్తావించినట్లు నోట్ ఒకటి తెర మీదకు వచ్చింది. పైగా బీజేపీ గురించి తక్కువ మాట్లాడేసరికి ఆ పార్టీతో పొత్తు ఉండబోతుందనే ప్రచారం బలంగా సాగుతోందంటూ అందులో వివరణాత్మకంగా రాసి ఉంది.

కేటీఆర్, హరీష్రరావు ఇంటికి వెళ్లి ఈ లేఖ తయారుచేశారు

"బీజేపీపై మీరు రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడటంతో భవిష్యత్తులో బీజేపీతో పొత్తు పెట్టుకుంటారనే ఊహాగానాలకు తావు ఇచ్చినట్లు అయింది. బీజేపీతో ఇబ్బంది పడిన నేను కూడా ఇదే అంశాన్ని కోరుకున్నా. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌పై నమ్మకం కోల్పోయిన వారు బీజేపీ మనకు ప్రత్యామ్నాయమవుతుందని అనుకుంటున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయకపోవడంతో బీజేపీకి మనం సాయం చేశామనే కోణాన్ని కాంగ్రెస్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది" అయితే ఆ నోట్ ఆమె రాసిందేనా? అనేదానిపై విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చాకే ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**కవిత లేఖపై అనుమానాలు: డీకే అరుణ**

కేసీఆర్‌కు కవిత లేఖ లేఖ రాయాల్సిన అవసరం ఏముందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ ప్రశ్నిస్తున్నారు. అసలు ఆ లేఖ బయటకు ఎలా వచ్చిందని ప్రశ్నిస్తున్నారామె.

## కడపలో జరగనున్న మహానాడు-2025 ఏర్పాట్లను సమీక్షించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల జిల్లా: బ్యూరో మే23(ప్రజా జ్యోతి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సభా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి సభ ఏర్పాట్లు, వసతి, రవాణా, భద్రత, పార్కింగ్, మీడియా సదుపాయాలపై సమన్వయ కమిటీ సభ్యులకు కడప జిల్లా ముఖ్య నేతలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో చర్చిస్తూ అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ..తెలుగుదేశం పార్టీ ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు ఈ సంవత్సరం మే 27, 28, 29 తేదీల్లో దేవుని గడప కడప జిల్లా పబ్బాపురంలో ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఈ మహాసభకు దేశ నలుమూలల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు లక్షలాది మంది హాజరవ్వుతున్న ఈ మహాసభను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. మహానాడు తొలి రెండు రోజులు ప్రతినిధుల సభలు, మూడవ రోజు బహిరంగ సభ జరగనున్నాయన్నారు.దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ సభలకు 5 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో ఏర్పాట్లను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టినట్లు మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాసరావు , కడప జిల్లా అధ్యక్షులు రెడ్డప్ప , శ్రీనివాస్ రెడ్డి, చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## డ్రైనేజీలలో పూడిక తీయాలని మున్సిపల్ కమిషనర్ కి సిపిఎం వినతి



**గుంతకల్లు మే 23 (ప్రజా జ్యోతి):** పట్టణంలో ఉన్న చిన్న, పెద్ద డ్రైనేజీలో పూడిక తీయించి,పట్టణ ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని శుక్రవారం సిపిఎం పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్ మాట్లాడుతూ గుంతకల్లు పట్టణంలో చిన్నపాటి వర్షానికి మురికి కాలువలు నిండి. ఇళ్లల్లోకి, రోడ్డు మీదకు మురికి నీరు వస్తుంది ఈ మురికి నీరు చేరడం వలన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నా రని,దీనిని అరికట్టడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలు వర్షాలకు మునిగి పోయేది చూస్తున్నాం అయిన కనీసం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం లేదు కావున మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదిక న పట్టణంలో చిన్న, పెద్ద అన్ని డ్రైనేజీ కాలువల పూడికను తీసి పట్టణ ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని కోరారు.లేనిపక్షం లో పట్టణ ప్రజలను కలుపుకొ ని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్యమాలు చేపడతామ న్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్ర, రంగమ్మ,పట్టణ కమిటీ సభ్యులు తిమ్మప్ప, అబ్దుల్లా,జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ గారి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుంతకల్లు మే 23 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు మండలంలోని చింతలంపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ధనుంజయ ఆధ్వర్యంలో చింతలంపల్లి గ్రామం లో ఏర్పాటు చేసిన అన్న నందమూరి తారకరామా రావు విగ్రహాన్ని ఆవిష్కరించా డానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం,టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పాల్గొని వందలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్యన ఎన్టీఆర్ విగ్రహానిక ఆవిష్కరించడం జరిగింది.ఈసందర్భంగా గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ధనుంజయ తెలుగుదేశం పార్టీ మీద అభిమానం తో తన సొంత గ్రామం లో అన్న గారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషం అని ఇలాంటి కార్యకర్తలు,నాయకులు ఉన్నంతకాలం టీడీపీ పార్టీ కి తిరుగులేదని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ధనుంజయ ప్రత్యేక ఆహ్వానం మేరకు ఆయన కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో గుంతకల్లు పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గంద్రేడు గ్రామానికి మహర్ధశ





**మారుతున్న గ్రామ రూపురేఖలు**
**సర్పంచ్ మణెమ్మ కృషి తో అడుగడుగునా కనబడుతున్న గ్రామ అభివృద్ధి**
**మరింత అభివృద్ధి చేసే దిశగా చర్యలు**
**గ్రామంలోకి వచ్చేందుకు సరైన రహదారి మార్గం లేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు**
**రహదారి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి చేర్చిన సర్పంచ్**
**రూ. 80 లక్షల నిధులతో బీటీ రోడ్డు మంజూరు**
**త్వరలోనే ప్రారంభం కానున్న టెండర్ల ప్రక్రియ**



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలం తాడివలస పంచాయతీ గం ద్రే డు గ్రామానికి మహర్ధశ పట్టింది. గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో స్థానిక సర్పంచ్ తమ్మినైన మణెమ్మ తన వంతు కృషి చేస్తున్నారు. సర్పంచ్ గా భాద్యతలు చేపట్టిన నాటి నుండి గ్రామాల అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రామాన్ని సర్వాంగ తీర్చిదిద్దుతున్నారు. ఒకప్పుడు సౌకర్యాలు లేక తీవ్ర అవస్థలు పడిన గ్రామస్తుల సమస్యలను పరిగణలోకి తీసుకుని గ్రామం అంతా సీసీ రోడ్లు , కాలువల ఏర్పాట్లు,పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు,మౌలిక సదుపాయాలు కల్పిస్తూ గ్రామస్తుల మన్నలను పొందుతున్నారు. వీటితో పాటు గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గ్రామంలోకి వచ్చేందుకు సరైన రహదారి మార్గం లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండటం తో ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువెళ్ళారు. ఆయన సానుకూలంగా స్పందించి రూ. 80 లక్షలతో బెలమాం జంక్షన్ నుండి గంద్రేడు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. త్వరలోనే బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో తమ సమస్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న రహదారి నిర్మాణానికి చొరవ తీసుకున్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ , సర్పంచ్ మణెమ్మ పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మణెమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి గ్రామాల అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ వహించిందన్నారు. గ్రామాల అభివృద్దే రాష్ట్ర అభివృద్ధి గా భావించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అదే దిశగా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. అందుకో భాగంగా నియోజకవర్గానికి సంబంధించి పొందూరు మండలంలో ప్రతీ గ్రామాన్ని సర్వాంగ సుందరంగా మార్చడం లో ఎమ్మెల్యే , రాష్ట్ర పి. యూ.సి ఛైర్మెన్ కూన రవికుమార్ కృషి ఎనలేనిదన్నారు. తాడివలస పంచాయతీ లో సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లిన ప్రతీ సంధర్భంలోనూ ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. తాడివలస పంచాయతీ లో ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

# గుడికి వెళ్లే నడక దారి మూయవద్దు.







**పోడూరు, పెనుగొండ మే 23,ప్రజాజ్యోతి న్యూస్. (రిపోర్టర్ కె కె ఆర్ వెంకట్ ).** వడలి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మందాలమ్మ దేవత గుడికి వెళ్లే నడకదారిని మూయవద్దని పెనుగొండ మండల అభివృద్ధి అధికారి టి సూర్యనారాయణ మూర్తిని శుక్రవారం గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందజేశారు . ఈ మేరకు గుడి కమిటీ, పంచాయతీ సర్పంచ్ సహకారంతో గుడికి వెళ్లే గ్రామస్తుల నడకదారిని కలిపి వసతి గృహ సముదాయం నిర్మించారు. ఆ సమయంలో గ్రామ ప్రజలకు గుడికి వెళ్లడానికి అవసరమైన దారి ఇవ్వాలని కోరగా దక్షిణం వైపున దారి ఇస్తామన్నారు . ఇప్పుడు ఉపయోగంలో ఉన్న దక్షిణం వైపు నడకదారి లో కూడా నూతన నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నం చేస్తుండగా గ్రామస్తులు ఆ ప్రయత్నం ఆపాలని మాకు పూర్వం నుండి ఉన్న నడకదారి కొనసాగించాలని మరోసారి అడిగారు. దానిపై గుడి కమిటీకి దారి ఇచ్చే ఆలోచన లేకపోవడంతో దారి విషయమై గతంలో ప్రజలకు ఇచ్చిన హామీని ఉల్లంఘించి నట్లైందని పంచాయతీ సహకారంతో దారిని పూర్తిగా మూసివేసే ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. తక్షణం అధికారులు కలగజేసుకుని గతంలో నుండి ఉన్న దారిని కొనసాగించాలని రెవెన్యూ డివిజనల్ అధికారిని,గ్రామ పంచాయతీ కార్యదర్శిని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కుంచే కృపారావు,చిటికెన చిన్న బ్రహ్మయ్య, బయ్యే వీర్రాజు, రాయవరపు వెంకటరమణారావు, దొండ శ్రీను, చిటికెన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ అందుబాటులో పాలన బాపట్ల కలెక్టర్ చొరవ అభినందనీయం...


**దివ్యాంగుల సంక్షేమంపై కీలక నిర్ణయాలు**
**వారంలో మూడు రోజులు సోమ మంగళ బుధవారం బాపట్లలో సేవలు అందించాలి**
**వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్**
**కలెక్టరేట్ ఆవరణలో ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు**
**ప్రభుత్వ ఉద్యోగాలలో 5 పర్సెంట్ కోటా అమలు, ఔట్సోర్సింగ్ ఉద్యోగాల్లో కూడా అదే విధంగా చర్యలు**
**మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 5 పర్సెంట్ షాపులు దివ్యాంగులకు కేటాయింపు**
**16 మంది ట్రాన్స్‌జెండర్‌లకు గుర్తింపు ధ్రువీకరణ పత్రాల పంపిణీ**




**బాపట్ల మే 23 (ప్రజాజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల కలెక్టరేట్ లో శుక్రవారం నిర్వహించిన గిరిజన మరియు దివ్యాంగుల ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు కీలక సూచనలు చేశారు గిరిజనుల సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని పేర్కొంటూ వేటపాలెంలో 60 మంది యానాది వర్గానికి ఆలస్యంగా జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం జరిగింది ఆధార్ నమోదు కోసం డోమిసైల్ ధ్రువీకరణ పత్రాల అవసరాన్ని గుర్తించి, తహసీల్దార్‌ను వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు అక్కయ్యపాలెం పంచాయతీలో 300 యానాది కుటుంబాలకు స్మశాన స్థలం కేటాయింపుపై నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

యోగాంధ్ర కార్యక్రమంపై కలెక్టర్ ఫోకస్ జిల్లాలో ఉన్న 42 వేల ఉద్యోగుల్లో కేవలం 6 వేలమంది మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తిచేయగా మిగిలినవారంతా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు, యోగా టీచర్లు తప్పనిసరిగా పాల్గొనాలని స్పష్టం చేశారు పెన్షన్ పంపిణీ తర్వాత మిగిలిన మొత్తం జూన్ 5లోపు ప్రభుత్వ ఖాతాలో చలానా రూపంలో జమ చేయాలని లేకపోతే వడ్డీతో వసూలు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, బాపట్ల డివిజన్ అధికారి గ్లోరియా గిరిజన సంక్షేమ అధికారి ప్రకాశ్ రావు వికలాంగుల సంక్షేమ అధికారి అర్చన తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియకు జిన్నూరులో యుటిఎఫ్ హెల్ప్ డెస్క్




పాలకొల్లు. ప్రజాజ్యోతి. (కొట్టి రామం) మే 23: ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియకు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఉపాధ్యాయులకు దరఖాస్తులు ఆన్ లైన్ చేయుటలో సహాయ పడేటందుకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పోడూరు మండల శాఖ ఆధ్వర్యంలో జిన్నూరు వంతెన సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేశారు. ఈ హెల్ప్ డెస్క్ ను జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ కె వి రామభద్రం శుక్రవారం ప్రారంభించారు. ఉపాధ్యాయులు బదిలీల దరఖాస్తులను సంఘ ఆధ్వర్యంలో చేయుటకు బదిలీలకు సంబందించిన సమస్యల పరిష్కారంలో సహాయ సహకారములు అందించుటకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసామని ఉపాధ్యాయులు ఈ సౌకర్యం ఉపయోగించుకోవాలని యు టి ఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎం వి రాజశేఖర్ తెలిపారు.ల ఈ కార్యక్రమ%శీ%లో మండల యు టి ఎఫ్ అధ్యక్షులు డి క్షేమమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి కె నాగరాజు, ఉపాధ్యాయులు సి హెచ్ త్రినాధ్,డి వి వి ప్రసాద్, సిహెచ్ కరుణకుమారి, కె.చిరంజీవి పాల్గొన్నారు.

## మద్యం షాపులు నిబంధనలు పాటించాలి




**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్:** మద్యం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇనస్పెక్టర్ వై రాజు అన్నారు. పొందూరు,జి సిగడాం సర్కిల్ పరిధిలో గల ఏ4 షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపు చుట్టుప్రక్కల ఎటువంటి అనధికార మద్యం విక్రయాలు ,త్రాగడం ,ఇతర కార్యకలాపాలు జరగకూడదని ఆయన అదేశించారు. మద్యం దుకాణాలను ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నిర్వహించాలని తెలిపారు. ప్రతీ రోజూ క్యూ ఆర్ కోడ్ లను స్కాన్ చేయించి ,దుకాణాల నందు సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించిన చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల నిర్వహణ ,మద్యం విక్రయం సమయం , అన్ని నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు.

## బద్వేల్ పట్టణంలో చురుగ్గా సుందరీకరణ పనులు



**బద్వేల్ మే 23 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ పట్టణ సుందరీకరణ లో భాగంగా అన్నీ ప్రధాన రహదారులలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ను మెరుగు పరచడం తో పాటు రోడ్డు మీదికి వచ్చేలా మరియు డ్రైనేజ్ పైన ఏర్పాటు చేసిన వ్యాపార ప్రకటనలతో కూడిన బోర్డులను మరియు షాప్ ల పేర్లతో కూడిన బోర్డులను మున్సిపల్ అధికారులు తొలగించి టౌన్ బ్యూటిఫికేషన్ మెరుగుదలకు చర్యలు తీసుకోవడం జరిగింది. కావున డ్రైనేజ్ పైన ఏర్పాటు చేసిన వ్యాపార ప్రకటనలతో కూడిన బోర్డులను మరియు షాప్ ల పేర్లతో కూడిన బోర్డులను షాప్ యజమానులు తక్షణమే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని మున్సిపల్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## కిషోర వికాసం... భవిష్యత్తుకు పునాది ఐ సి డి ఎస్ సూపర్వైజర్ పుష్పవతి




**గుంతకల్లు మే 23 (ప్రజాజ్యోతి):** కిశోర వికాసం కార్యక్రమం ఒక వరమని, అది వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ బి.పుష్పవతి తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని ఎం. నాగమణి మరియు గుత్తి ప్రాజెక్టు సిడిపిఓ భారతి ఆదేశాల మేరకు శుక్రవారం గుంతకల్లు పట్టణంలోని గుంత బావి వీధి సెక్షన్ 7 అంగన్వాడీ కేంద్రంలో కిశోర బాలికల ఉద్దేశించి మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు వేసవి సెలవుల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ప్రతీ బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకు నేలా,సమగ్ర అభివృద్ధి సొంతం చేసుకునేలా మరియు బాల్యవివాహాలు,1098, ఫోక్సోయాక్ట్ 2012 బాలల హక్కులు,విద్యఆవశ్యకత, నైపుణ్యభివృద్ధి,ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై పుష్పవతి వివరించారు. జిల్లా బాలల సంరక్షణ

# గుంతకల్లు రైల్వే స్టేషన్లో బాలుడిపై పైకప్పు పెచ్చులు పడి.. బాలుడు మృతి

**రైల్వే అధికారులు నిర్లక్ష్యము, రైల్వే కాంట్రాక్టర్లు అవినీతి కారణంగా బాలుడు మృతి: సిపిఐ జగదీష్**



**గుంతకల్లు మే 23 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు రైల్వే స్టేషన్లో ఏడో నెంబర్ ప్లాట్ఫారం మీద తెల్లవారుజామున మూడు గంటలకు కర్నూలుకు చెందిన వెంకటేశ్వర్లు కుటుంబం రామేశ్వరం కు వెళ్లేందుకు గుంతకల్ రైల్వే స్టేషన్ లో రైలు కోసం ఏడో నెంబర్ ప్లాట్ఫారం పై వేచి ఉన్నారు .బాలుడు మణికంఠ వెయిటింగ్ హాల్ ముందర పడుకొని ఉండగా పైకప్పు పెచ్చులూడి తల పైన పడటం వలన తీవ్ర గాయాల పాలయ్యాడు. ఆ బాలుని ప్రభుత్వాసుపత్రికి తరలించగా డాక్టర్ చూసి అప్పుడే మృతి చెందాడు అని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఐ పార్టీ బృందం గుంతకల్ రైల్వేస్టేషన్లో ఏడో నెంబర్ ప్లాట్ఫారం కి వెళ్లి వెయిటింగ్ హాల్ ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ డీ జగదీష్ మాట్లాడుతూ రైల్వే అధికారుల నిర్లక్ష్యము, రైల్వే కాంట్రాక్టర్లు అవినీతి కారణంగా ఒక బాలుడు మృతి చెందడం చాలా బాధాకరమని, గుంటకల్ రైల్వే డిఆర్ఎం కాంట్రాక్టర్లతో లంచం తీసుకుంటూ సిబిఐ కి పట్టుబడిన విషయాన్ని ఈ సందర్భంగా జగదీష్ గుర్తు చేశారు. రైల్వే అధికారులకు కమిషన్లు లంచము ఇచ్చి నాసిరకం పనులు రైల్వేస్టేషన్లో చేసినందువలన పైకప్పు సిమెంటు పలక ఊడి పడిందని దానివల్లే బాలుడు మరణించినాడని దీనికి పూర్తి బాధ్యత రైల్వే అధికారులు వహించాలని ఆయన ఆరోపించారు. గుంతకల్ రైల్వేలో అవినీతి రూపుమాపాలని అప్పుడే రైల్వే ట్రాకు గాని ,రైల్వే లోప స్టేషన్ లో కూడా నాసరికమైన పనులు చేసినారో, అధికారులు పరిశీలించి ,ఆ కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని అలాగే రైల్వే అధికారులు ఈ సంఘటన కు బాధ్యులైన అధికారులను తక్షణం సస్పెండ్ చేయాలని అన్నారు. అప్పుడు రైల్లో ప్రయాణికులు కూడా నమ్మకంతో ప్రయాణం చేస్తారు. రైల్వే స్టేషన్లో వెయిటింగ్ హాల్లో నిద్రపోవచ్చు అని ప్రజలు అనుకుంటారు. గుంతకల్ రైల్వే స్టేషన్ లో 4 ,5 ,6 ,7 ప్లాట్ఫారాలు గత 50 సంవత్సరాల క్రితం నిర్మించినవి. అవి ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయి. అందువల్లనే పైకప్పు ఊడిపడుతున్నందువల్ల దానికి సీట్లు కొట్టారు. పవన్ యుద్ధ ప్రాతిపదికన నాలుగు ఐదు ,ఆరు ,ఏడు ప్లాట్ఫారాల పైకప్పులు నూతనంగా నిర్మించాలని డిమాండ్ చేశారు. గుంటకల్ రైల్వే లో జరుగుతున్నటువంటి అవినీతి పై అవినీతి నిరోధక శాఖకు కంప్లైంట్ చేస్తాం .అలాగే రైల్వే బోర్డు కు, రైల్వేమినిస్టర్కు కూడా ఒక లెటర్ పెడతామని అన్నారు.బాలుడు కుటుంబానికి 50 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, అదేవిధంగా ఆ కుటుంబంలో ఒకరికి రైల్వే ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు బి గోవిందు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, సహాయ కార్యదర్శి బి మహేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, సిపిఐ మండల కార్యదర్శి రాము రాయల్, సహాయ కార్యదర్శి రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కే దేవేంద్ర ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బిసి కుల్లాయప్ప నాయకులు ప్రజానాట్యమండలి పట్టణ అధ్యక్షులు,ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకట్ నాయక్ నూర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్లో అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోయిన బాలుడు

**కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని: సిపిఎం**



**గుంతకల్లు మే 23 (ప్రజాజ్యోతి):** గుంతకల్లు రైల్వేస్టేషన్లో అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల ఒక బాలుడు ప్రాణాలు చాలా బాధాకరమైన విషయమని సంబంధిత కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు శుక్రవారం రైల్వే స్టేషన్ లోని ఏడవ నెంబర్ ప్లాట్ఫారం ను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు కర్నూలుకు చెందిన వెంకటేశ్వర్లు కుటుంబం రామేశ్వరం కు వెళ్లేందుకు గుంతకల్లు రైల్వే స్టేషన్ లోని రైలు కోసం 7వ ప్లాట్ఫారంలో వేచి ఉన్నారు. బాలుడు మణికంఠ వేటింగ్ హాల్ ముందు పడుకొని ఉండగా పై కప్పు పెచ్చులూడి బాలుడి తలపై పడటం తీవ్ర గాయాలు పాలై చనిపోవడం జరిగిందని, ఎక్కడైతే సిమెంట్ పెక్కులు కూలి బాలుడు చనిపోయిన ఆ ప్రదేశంలో యుద్ధ ప్రాతిపదికన పైకప్పు మునిన అధికారు లు తమ తప్పుని కప్పు పుచ్చుకోవడా నికి యుద్ధ ప్రాతి పదికిన ఆ ప్రదేశం పై కప్పు మూయడమే దీనికి నిదర్శనంగా కనిపిస్తోం ది.ఇంతటి నిర్లక్ష్యానికి పాల్పడిన అధికారులపై రైల్వే ఉన్నత అధికారులు శాఖపర మైన చర్యలు తీసుకొని మరణించిన బాలుడు కుటుంబానికి 50 లక్షలు ఎక్స్గ్రేషన్ ఇవ్వాలని అలాగే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆ కుటుంబా నికి ఆదుకోవాలని సిపిఎం పార్టీ రైల్వే ఉన్నత అధికారుల వారిని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్,కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్రబాబు,పట్టణ కమిటీ సభ్యులు పార్టీ నాయకులు తిమ్మప్ప,రాము,బుజ్జి,వంశీ, కర్ణ,రాజు మొదలగువారు పాల్గొన్నారు.

# దాతల సహకారం

- నాగవంశ వాడలో అమ్మవారి పండుగకు విరాళాల సేకరణ
- విశేషంగా లభిస్తున్న స్పందన
- తమ వంతు ఆర్థిక సహాయం అందిస్తున్న దాతలు
- రూ.25 వేలు,రూ.31 వేయి అందించిన గాడు నాగరాజు ,కోరుకొండ రమణా రావు, రమేష్



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు పట్టణ ప్రజల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి పండుగ నిర్వాహణకు చేపడుతున్న విరాళాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుండి విశేషంగా స్పందన లభిస్తుంది. పండుగ నిర్వాహణకు కొద్ది రోజుల సమయం మాత్రమే ఉండటంతో పండుగ కమిటీ సభ్యులు విరాళాల సేకరణ కార్యక్రమాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు. కస్పావీధి ,నాయుడు వీధి , కనకల వీధి ,నాగవంశం పురవీధుల్లో పర్యటిస్తూ దాతల నుండి ఆర్థిక సహాయం పొందుతున్నారు. శుక్రవారం నాడు చేపట్టిన విరాళాల సేకరణ లో కోరుకొండ వీధికి చెందిన కోరుకొండ వెంకట రమణా రావు ,రమేష్ ( రిటైర్డు పొల్యూషన్ డిపార్ట్మెంట్ ఎస్.సి) వారు రూ. 31,116 , కనకల వీధికి చెందిన వైసిపి పొందూరు పట్టణ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు రూ. 25 వేలు ,లాయర్ అనకాపల్లి రంగారావు మాజీ ఎంపీటీసీ అనూష దంపతులు రూ.10 వేలు అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. వీటితో పాటు పలువురు తమ వంతు సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంబిల్లి నాగరాజు , మొకర సత్యన్నారాయణ , అనకాపల్లి శ్రీనివాసరావు , గుడ్ల మోహన్ ,రిటైర్డు ఉపాధ్యాయులు కోరుకొండ విజయ్ కుమార్ ,అనకాపల్లి శివ కుమార్ ,కాలెపు శ్రీనివాస రావు ( కె వి ఆర్ ), కోరుకొండ రాజశేఖర్,అనకాపల్లి గోవింద్, ఆనెం పాపారావు , గుంటుకు రాము , రాయిపిల్లి రాంబాబు , అనకాపల్లి భవాని ,ఎం.ఈ. ఓ 2 పట్నాన రాజారావు ,అనకాపల్లి చిన్న , మాసాడ భోగిరాజు, ఎస్టీ సెల్ అధ్యక్షులు గొర్లె సూర్యారావు , మల్లిక భుజంగ రావు, మన్యాన వెంకట రావు,గుడ్ల సాయి రాజు తదితరుల పండుగ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మద్యం షాపులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు..

**బాపట్ల జిల్లా ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వర్లు..**






**బాపట్ల, మే 23 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** జిల్లాలో మద్యం షాపులు నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయా షాపు యజమానులపై చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ (ఇంచార్జ్) అధికారి బి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న మద్యం దుకాణాలు పని వేళల సమయాలను శుక్రవారం పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. మద్యం షాపులు ఉదయం 10గంటల నుండి రాత్రి 10గంటల వరకు నిర్వహిస్తున్నారని అన్నారు. బాపట్ల జిల్లాలోని ఏడు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని షాపుల పని వేళలు, ఎమ్మార్పీ ఉల్లంఘనలు మరియు బెల్టు షాపుల గురించి జిల్లా టాస్క్ ఫోర్స్ మరియు జిల్లా ఎన్ఫోర్స్మెంట్ సిబ్బందితో నిరంతరం నిఘా ఉంచామన్నారు. అదేవిధంగా నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాపట్ల జిల్లాలోని ఏవైనా మద్యం దుకాణాలు నిబందనలు అతిక్రమించి కేటాయించిన సమయానికన్నా ముందుగా షాపులు తెరచిన లేదా రాత్రి సమయాలలో ఎక్కువసేపు తెరిచి ఉంచిన, ఆయా మద్యం దుకాణాల యజమానులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## రోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ద్విచక్ర వాహనదారులు



**తాళ్లపూడి, మే 23, ప్రజా జ్యోతిన్యూస్** అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినా మారని ఇసుక లారీల తీరు కొవ్వూరు నుండి తాళ్లపూడి వరకు ఇసుక ర్యాంపులలో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇసుక ర్యాంపుల నుండి బయలుదేరే లారీలపై టార్పాలిన్ కప్పాలని అధికారులు ఎన్ని హెచ్చరికలు జారీచేసిన నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. లారీలపై టార్పాలిన్ లేకపోవడంతో రోడ్డు మొత్తం ఇసుక మయం కావడంతో ద్విచక్ర వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం ఇదే రహదారిపై ఇసుక పేరుకుపోవడంతో ఒక మహిళ జారిపడి కాలు విరిగిన సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ర్యాంపునిర్వాహకులు వ్యాపారాలు చేసుకుని జేబులు నింపుకోవడమే తప్ప ప్రభుత్వ అధికారులు జారీ చేసిన నిబంధనలను ఏ ఒక్కటి పాటించడం లేదు అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాహనదారుల ఇబ్బందులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కొట్రకే మధుసూదన్ గుప్తా



**గుంతకల్లు మే 23 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు పట్టణంలోని పీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ లో నారాయణ కుమార్తె వివాహానికి మరియు మండలంలోని చింతలంపల్లి గ్రామంలో ధనుంజయ కుమారుడు వివాహానికి గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే కుట్రకే మధుసూదన్ గుప్తా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## అగ్ని ప్రమాదంలో తాటాకు ఇల్లు దగ్ధం



**తాళ్లపూడి, మే23, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం రావూరుపాడు గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు మేకా.వెంకన్న నివాసంలో శుక్రవారం సాయంత్రం సుమారు నాలుగున్నర గంటలకు అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది ఈ ప్రమాదం వలన ఆయన భార్య లక్ష్మి పార్వతి కాలినగాయాల య్యాయి సుమారు అరవై వేల రూపాయలు నగదు, మరియు గృహోపకరణాలు, కాలి బూడిద అయ్యాయని రోదిస్తున్నారు గ్రామ రెవెన్యూ అధికారి సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించినట్లు సమాచారం. ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న బాధిత కుటుంబం ముప్పై ఐదు ఏళ్ల కల సాకారమైంది...

## సొంత నిధులతో వంతెన నిర్మించిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

సుబ్బారెడ్డి పాలెం గ్రామంలో జన్మదినం సందర్భంగా ప్రారంభోత్సవం



**బాపట్ల మే 23 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** ఎన్నికలలో గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ వంతెన నిర్మాణం పూర్తి చేయించిన బాపట్ల నియోజకవర్గ శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తన జన్మదినాన ప్రత్యేకంగా ప్రజలకు అంకితం చేశారు. బాపట్ల మండలంలోని పడమర బాపట్ల పంచాయతీ పరిధిలో ఉన్న సుబ్బారెడ్డి పాలెంలో, గ్రామస్థుల నాటి వినతిని నెరవేర్చుతూ, ఆయనే స్వయంగా వ్యయభారం భరించి నిర్మించిన వంతెనను శుక్రవారం ప్రారంభించారు గత ఎన్నికల సమయంలో గ్రామంలో పర్యటించిన నరేంద్ర వర్మ, వెస్ట్ బాపట్ల ఛానల్‌పై వంతెన నిర్మాణం కోసం ప్రజల నుంచి విజ్ఞప్తిని స్వీకరించారు అప్పట్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ప్రస్తుత ప్రభుత్వం ఆధ్వర్యంలో పి4 కార్యక్రమంలో భాగంగా ఈ వంతెనను నిర్మించారు ఈ వంతెన ద్వారా స్థానికంగా ఉన్న డంపింగ్ యార్డ్‌కి రాకపోకలు సులభమవుతాయి గతంలో గ్రామస్తులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ఇప్పుడు వారికీ శాశ్వత పరిష్కారం లభించిందని గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు 35 ఏళ్లుగా ఈ వంతెన కోసం ఎదురుచూస్తున్న తమ కల నెరవేరిందని వారు భావోద్వేగంగా పేర్కొన్నారు గ్రామ ప్రజలు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ కి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన సేవా భావాన్ని అభినందించారు

## అదృష్టానికి వజ్రాన్వేషణ.....



**ప్రజా జ్యోతి తుగ్గలి** అక్కడ వర్షాలు పడితే చాలు ఆరేళ్ల పిల్లల నుంచి అరవై ఏళ్లు దాటిన వృద్ధులు కూడా వేట మొదలుపెడతారు. అది మామూలు వేట కాదు,అదృష్టాన్ని వెతుక్కుంటూ వెళ్లే వజ్రాల వేట. ఇది ఎక్కడో కాదు కర్నూలు జిల్లా, తుగ్గలి మండల పరిధిలోని శుక్రవారం జొన్నగిరి,తుగ్గలి, గిరిగేట్ల, అమినాబాద్,చెన్నంపల్లి, మదనంత పురం,పెరవలి,తదితర గ్రామ పొలాల్లో వజ్రాన్వేషణలో ప్రజలు నిమగ్నమయ్యారు.వర్షాలు పడుతుండడంతో వజ్రాలు దొరుకుతాయని ఆశతో సుదూర ప్రాంతాల నుంచి ఉదయాన్నే పొలాల్లో వాలిపోతున్నారు.జనాలు ఉదయము నుంచి సాయంత్రం వరకు వజ్రాన్వేషణ చేస్తున్నారు. ఒక్క వజ్రం దొరికితే తమ కష్టాలు తీరతాయని,జీవితం మారుతుందని వజ్రాన్వేషణ చేస్తుంటారు.

## లింగాల వాగు పై నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు







**ప్రజా జ్యోతి తుగ్గలి** కర్నూలు జిల్లా,తుగ్గలి మండలం,గిరిగేట్ల గ్రామ సమీపం వద్ద లింగాల వాగు పై నిర్మించిన బ్రిడ్జి ఇరు ప్రక్కల పగళ్ళు ఏర్పడి వాహన ప్రయాణికులకు తీవ్ర అంతరాయం తప్పడం లేదు.ఈ వంతన మంత్రాలయం మరియు బెంగళూరు మెయిన్ రహదారైనా బస్సులు,లారీలు ఇతర వాహనాలు, భారీ యంత్రాలు రాత్రిపగలు ప్రయాణిస్తుంటాయి.ఈ బ్రిడ్జి వెడల్పు లేనందున ఎదురెదురుగా వస్తే వాహనాలు తప్పించుకునే మార్గం లేదు.బ్రిటిష్ కాలంలో నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది.బ్రిడ్జికి రక్షణగా ఏర్పాటు చేసిన రెయిలింగ్ వాహనాలు ఢీకొని పలుచోట్ల దెబ్బతినడం వలన శిథిలమైన వంతెనపై రాకపోకలకు వాహనదారులు జంకుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే బ్రిడ్జి రెయిలింగ్, బ్రిడ్జి వెడల్పు మరమ్మతు పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

# అశ్రునయనాలతో ముగిసిన ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ కె.వెంకట రాజు అంతిమయాత్ర..





కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఇంటెలిజెన్స్ ఐజీ పి.హెచ్.డి. రామకృష్ణ, జిల్లా ఎస్పీ తుషార్ డూడి..

**బాపట్ల, మే 23 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల జిల్లా చీరాల పట్టణానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ (1924) కె.వెంకట రాజు, ఇంటెలిజెన్స్ విభాగం లో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో ఆయన మృతికి అధికారులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.గురువారం గుంటూరు నుండి చీరాలకు కారులో వస్తుండగా అర్ధరాత్రి సమయంలో పెదనందిపాడు - పర్చూరు రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందారు.శుక్రవారం అయన స్వస్థలమైన చీరాల పట్టణంలోని స్థానిక స్మశాన వాటికలో వారి కులాచారాల మేరకు పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు.ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ కె.వెంకట రాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఐజీ పి.హెచ్.డి. రామకృష్ణ, జిల్లా ఎస్పీ తుషార్ డూడి లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అతడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంకిత భావంతో విధులు నిర్వహించే వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. అతడి కుటుంబానికి పోలీస్ యంత్రాంగం అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటెలిజెన్స్ ఐజీ పి.హెచ్.డి. రామకృష్ణ వెంకట రాజు పార్థివ దేహానికి పుష్పాంజలి సమర్పించి ఘన నివాళి అర్పించారు. తీవ్ర శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చారు. పోలీస్ శాఖ నుండు మట్టి ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. చీరాల డిఎస్పీ మోయిన్, రీజినల్ ఇంటిలిజెన్స్ ఆఫీసర్ వి.శ్రీరామ్, బాపట్ల ఇంటిలిజెన్స్ ఇన్స్పెక్టర్ జి.వి. నారాయణ, చీరాల 2 టౌన్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, చీరాల రూరల్ సిఐ శేషగిరిరావు, ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది వెంకట రాజు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

-ఎస్సై బోనగిరి రాజు



**కంచికచర్ల, మే 23 – ప్రజా జ్యోతి** కంచికచర్ల పట్టణం లో ప్రధాన కూడలిలో ఎస్ఐ రాజు శుక్రవారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించి తీసుకోవాలని ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో నడిపేవారు ప్రయాణికులను పరిమితికి ఎక్కించరాదని, సరైన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.ద్విచక్ర వాహనాలు పై త్రిబుల్ రైడింగ్ చేయొద్దని,మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వద్దని, పరిమితికి మించిన వేగంతో వెళ్ళవద్దని సూచించారు శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనంతగిరి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా సోవేరి సుబ్బారావు.



**అనంతగిరి.మే 23. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధిష్టానం ఆదేశాల మేరకు అరకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ సేవేరి దోన్ను దొర.అనంతగిరి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా సో వెరీ సుబ్బారావును నియమించినట్లు ప్రకటించారు. పార్టీ అభిమానులు. కార్యకర్తలు. మండల నాయకుల అభిప్రాయాలు తీసుకొని ఒకటికి రెండుసార్లు ఆలోచించి అధ్యక్షులు ప్రకటన నిర్ణయం ఇన్చార్జి తీసుకోవడం జరిగిందని. ప్రకటన విడుదల చేశారు.

## తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై ప్రతి పక్షానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ దాడి

కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్ ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలం గజ్జనపూడి గ్రామంలో ప్రతిపక్ష పార్టీ కి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్. టిడిపి పార్టీ కార్యకర్తలపై నాయకులపై కర్రలతో దాడి నిన్న అన్నవరంలో నేడు గజ్జినపూడిలో కష్టపడి పార్టీలోకి పనిచేస్తే మాకు రక్షణ లేదా అంటూకన్నీరు కాస్తున్న టీడీపీ శ్రేణులు ప్రతిపక్ష నాయకులుదేరాజ్యమా అంటూ మరి కొంతమంది పార్టీ శ్రేణులు భయం భయంతో ఉనికి పోతున్నారు

## పుట్టినరోజు - పుష్పాభిషేకాలతో ప్రజానాయకుడికి ఘనంగా శుభాకాంక్షలు...

బాపట్ల పట్టణంలో ప్రజల మద్దతుతో అభివృద్ధి దిశగా నాయకుడు–


సేవా స్ఫూర్తితో ముందుకెళ్తున్న బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వరమరాజు–



**బాపట్ల మే 23 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల జిల్లా కేంద్రంగా ఉన్న బాపట్ల పట్టణం నేడు ఒక విశేష కార్యక్రమానికి వేదిక అయింది. స్థానిక ప్రజా నాయకుడు నరేంద్ర వర్మ రాజు శుక్రవారం నిర్వహించిన తన పుట్టినరోజు మహోత్సవ కార్యక్రమం ప్రజలలో ఆసక్తిని రేకెత్తించింది. స్థానిక వేదికపై సంప్రదాయ పంచ కట్టు వస్త్రధారణలో ఎమ్మెల్యేని భారీ పుష్పహారాలతో అభిమానులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వేలాది మంది ప్రజలు, నాయకుడిపై తమ అభిమానాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా శారీరక వైకల్యం ఉన్నవారికి త్రివీలర్లు, నిరుపేద మహిళలకు జీవనోపాధికి ఆర్థిక సాయం, అభిమానులు పుట్టినరోజు వేడుకలలో పాఠశాలకు వెళ్లే పిల్లల నిమిత్తం స్టేషనరీ కిట్లు ఎమ్మెల్యేకి అందజేయడం జరిగింది. అనంతరం రక్తదాన శిబిరాలను సందర్శించి రక్తదాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాపట్ల అభివృద్ధి నా లక్ష్యం. మీ మద్దతు ఉంటే ప్రతి ఇంటిలో వెలుగు నింపవచ్చని తన అభిమానులకు వచ్చిన ప్రజలకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కోటమి నాయకులు ప్రజలు అభిమానులు వేలాదిగా పాల్గొన్నారు తరలివచ్చిన వేలాది ప్రజానీకానికి భోజన వసతి కల్పించారు

## పల్లపుచామవరం గ్రామంలోమురళిరాజు పర్యటన

పోతుల వారి వివాహ వేడుకలో పాల్గొన్న మురళిరాజు




**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ప్రజా జ్యోతి రిపోర్టర్ వీరబాబు** రౌతులపూడి మండలం పల్లపుచామవరం గ్రామంలో పోతుల రాజు కుమారుడు రవికుమార్ వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించిన లిప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు %ఒ% నరసాపురం పార్లమెంటు పరిశీలకులు%ఒ% ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు శంఖవరం మండలం ఎంపీపీ పర్వత రాజబాబు ఈ కార్యక్రమంలో పల్లపుచామవరం ఎంపీటీసీ ,గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ , మల్లంపేట సర్పంచ్ పాలకుర్తి తాతాజీ ,అన్నవరం ఎంపీటీసీ దడాల సతీష్ పల్లపుచామవరం వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు ఏసుబాబు ,పల్లపుచామవరం మాజీ వైస్ సర్పంచ్ ,కోలా తాతబాబు,బొల్లు నాగేశ్వరరావు జువ్వల దొరబాబు,పోకనాటి వెంకటేశ్వరరావు , మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ల,వైయస్సార్సీపి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ప్రధాన డ్రైనేజీ పూడికతీత పనులను పరిశీలించిన మునిసిపల్ కమిషనర్....



**బాపట్ల మే 23 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆదేశాల మేరకు, బాపట్ల పట్టణ పరిధిలోని మచ్చావారి పాలెం సమీపంలో జరుగుతున్న పురపాలక సంఘ ప్రధాన డ్రైనేజీ పూడికతీత పనులను మునిసిపల్ కమిషనర్ శ్రీ జి. రఘునాథ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పరిశీలన అనంతరం పట్టణంలోని అన్ని ప్రధాన డ్రైనేజీ లలో పూడికతీత పనులను తక్షణమే వేగవంతం చేయాలని సంబంధిత మునిసిపల్ ఇంజనీరు మరియు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలం మొదలయ్యే ముందు డ్రైనేజీ వ్యవస్థను సమర్థవంతంగా శుభ్రపరచడం ద్వారా రోడ్డు పాడయ్యే వంటి సమస్యలను నివారించవచ్చని చెప్పారు పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుధ్య వాతావరణం అందించేందుకు పురపాలక సంఘం కృషి చేస్తోందని పనుల కార్యాచరణ వేగం కొనసాగుతుందని కమిషనర్ తెలిపారు ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్ కరుణ సచివాలయం సిబ్బంది సానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై ప్రతి పక్షానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మొల్లి శివాజీ దాడి



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలం గజ్జనపూడి గ్రామంలో ప్రతిపక్ష పార్టీ కి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్. టిడిపి పార్టీ కార్యకర్తలపై నాయకులపై కర్రలతో దాడి నిన్న అన్నవరంలో నేడు గజ్జినపూడిలో కష్టపడి పార్టీలోకి పనిచేస్తే మాకు రక్షణ లేదా అంటూకన్నీరు కాస్తున్న టీడీపీ శ్రేణులు ప్రతిపక్ష నాయకులుదేరాజ్యమా అంటూ మరి కొంతమంది పార్టీ శ్రేణులు భయం భయంతో ఉనికి పోతున్నారు

# ఈడీ చిక్కుల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి
# విమర్శలు మొదలు పెట్టిన కేటీఆర్




**హైదరాబాద్ :** కాంగ్రెస్‌ను చికాకు పెడుతున్న కేసుల్లో నేషనల్ హెరాల్డ్ కేసు ఒకటి. ఇందులో నిందితులుగా రాహుల్ గాంధీ, సోనియా గాంధీతోపాటు మరో ఐదుగురు ఉన్నారు. ఇప్పుడు ఈ కేసులో తెలంగాణ ముఖ్యమంత్రికి కూడా భాగం ఉందని ఈడీ పేర్కొనడంతో సంచలనంగా మారుతోంది. దీంతో ప్రతిపక్షాలు కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నాయి. నేషనల్ హెరాల్డ్ కేసులో గత నెలలోనే ఈడీ ఛార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పిం చింది. ఇందులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు ఐదుగుర్ని నిందితులుగా చేర్చింది. కానీ ఈ కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పవన్ బన్సల్, చనిపోయిన నేత అహ్మద్ పటేల్ పేర్లు రావడం ఇప్పుడు సంచలనంగా మారుతోంది.యంగ్ ఇండియా సంస్థ ఏర్పాటు చేసి అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ఆస్తులు కొట్టేయడానికి యత్నించారని ఈడీ ఆరోపిస్తోంది. ఈ ఆస్తుల విలువ దాదాపు రెండు వేల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ యంగ్ ఇండియా సంస్థ ఏర్పాటులో చాలా మంది కాంగ్రెస్ నేతలు భాగమయ్యారని 2019-22 మధ్య విరాళాల రూపంలో డబ్బులు వసూలు చేశారని పేర్కొంది ఈడీ. పదవులు, ఇతర ప్రయోజనాలు ఎర చూపించి డబ్బులు వసూలు చేసినట్టు పేర్కొంది. అందులో అప్పటి పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి, పవన్ బన్సల్, అహ్మద్ పటేల్ భాగమయ్యారని తెలిపింది. పూర్తి స్థాయి విచారణ తర్వాత ఈ విషయాన్ని ఛార్జిషీట్‌లో పెట్టినట్టు ఈడీ వెల్లడించింది. ఈ కేసులో విచారణలో భాగంగా గతంలో సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, అంజన్ కుమార్ యాదవ్, గీతారెడ్డి, గాలి అనిల్ కుమార్‌ను కూడా ఈడీ విచారించింది. ఇప్పుడు ఈడీ ఛార్జ్‌షీట్‌ను అస్త్రంగా మార్చుకుంటోంది బీఆర్ఎస్. ఈ విషయంపై కేటీర్ ట్వీట్ చేశారు. రేవంత్ రెడ్డి అవినీతి ఈడీ కేసుతో తేటతెల్లమైందని పేర్కొన్నారు." యంగ్ ఇండియా సంస్థకు విరాళాలు ఇస్తే పదవులు ఇప్పిస్తానని రేవంత్ రెడ్డి ప్రలోభ పెట్టినట్టు ఈడీ నమోదు చేసిన చార్జిషీట్‌తో సీఎం అవినీతి సామ్రాజ్యం బట్టబయలైంది.అధికారం కోసం ముఖ్యమంత్రి కాకముందే కాంగ్రెస్ పార్టీ పెద్దలకు వందల కోట్లు కట్టబెట్టిన వ్యవహారం కుండబద్దలు కొట్టినట్లైంది. వందల కోట్లతో మొదలైన రేవంత్ అవినీతి బాగోతం గత ఏడాదిన్నరలో సీఎం పదవిని అడ్డం పెట్టుకుని ఏకంగా వేల కోట్లకు చేరింది. దివ్యమైన తెలంగాణని దివాళా తీసి వేల కోట్లు కొల్లగొట్టడం వల్లే ఈడీ కేసులో రేవంత్ రెడ్డి అడ్డంగా ఇరుక్కుపోయారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ? పొంగులేటి తరహాలో చీకట్లో బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకుంటారా అంటూ అనుమానం వ్యక్తం చేశారు. ఈడీ, కేవలం చార్జిషీటులో పేరు పెట్టడం వరకే పరిమితం అవుతుందా ? లేక రేవంత్ రెడ్డిని విచారణను పిలిచి మొత్తం అవినీతి కుంభకోణాలను కక్కిస్తుందా ??" అని అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో రోజురోజుకూ పేట్రేగిపోతున్న అంతర్గత కుమ్ములాటలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కకావికలమైందన్నారు కేటీఆర్. పెరిగిపోతున్న తిరుగుబాట్లతో సీఎం కుర్చీ ఎప్పుడూ కూలిపోతుందో అనే భయం రేవంత్ రెడ్డిని అడుగడుగునా వెంటాడుతోందని విమర్శించారు. ఏం చేయాలో తెలియని దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్న కాంగ్రెస్, ముఖ్యమంత్రి.. అటెన్షన్ డైవర్షన్ కోసం రోజురోజుకూ చేస్తున్న చిల్లర చేష్టలు, కొత్త కుట్రలకు తెరపడినట్టేనని అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్ కు పిల్లనిచ్చిన మామ సూదిని పద్మారెడ్డియే స్వయంగా కాళేశ్వరంలో అవినీతి జరగలేదనడంతో ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ పార్టీ ఫ్యూజులు ఒక్కసారిగా ఎగిరిపోయినట్టు అయిందన్నారు కేటీఆర్. కమిషన్లు లేనిదే ప్రభుత్వంలో ఒక్కటంటే ఒక్క ఫైలు కదలడం లేదని స్వయంగా కేబినెట్ మంత్రి కొండా సురేఖ కుండబద్దలు కొట్టడంతో కాంగ్రెస్ నిర్వాకాలన్నీ వరుసగా వెలుగుచూస్తున్నాయని తెలిపారు. 30 శాతం పర్సెంటేజీలు ఇవ్వనిదే సొంత ప్రభుత్వంలో పనులు కావడం లేదని సాక్షాత్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆ పార్టీ బట్టలిప్పడంతో కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. నాలుగు కోట్ల ప్రజల ముందు ముఖ్యమంత్రి అవినీతి బాగోతం బట్టబయలు కావడంతో కుడితిలో పడిన ఎలుకలా కాంగ్రెస్ పార్టీ కొట్టుకుంటోందని ఎద్దేవా చేశారు కేటీఆర్. పచ్చని రాష్ట్రంలో చిచ్చుపెట్టడమే కాకుండా వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీచేస్తూ, పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న ముఖ్యమంత్రి పాపం పండింది... చివరికి ధర్మం గెలుస్తుందని అభిప్రాయపడ్డారు

# మళ్లీ క్వారంటైన్ భయం



**హైదరాబాద్, విజయవాడ:** కరోనా కొత్త వేరియంట్ నిజంగానే అంత భయానకమా..? మళ్లీ క్వారెంటైన్ కష్టాలు తప్పవా..? పరిస్థితి లాక్‌డౌన్‌కు దారితీస్తుందా? అనే భయాల కంటే ముందుగా గుర్తొచ్చేది కొవిడ్ బూస్టర్ వ్యాక్సిన్. కానీ.. బూస్టర్ వెయ్యించుకోవాలా వద్దా అనేది కూడా ఇప్పుడు ప్రపంచ సమస్యగా మారింది. ఔను.. కోవిడ్ వ్యాక్సినేషన్‌తో గుండెపోటు వచ్చే ఛాన్సుందట.ఐదేళ్ల కిందట ప్రపంచాన్ని కుదిపేసిన పీడకల కొవిడ్-19.. నేను బతికే ఉన్నా అంటూ అడపాదడపా హెచ్చరిస్తూనే ఉంది. వారం రోజులుగా ఆసియన్ కంట్రీస్‌లో టెర్రర్ పుట్టిస్తోంది. మనదాకా రాలేదుగా అనుకుంటుండగానే భారత్‌లో పాజిటివ్ కేసుల సంఖ్య అమాంతం పెరుగుతూ.. కొవిడ్ భయాన్ని మళ్లీ పరిచయం చేస్తోంది.ప్రస్తుతం మన దేశంలో 250కి పైగా యాక్టివ్ కేసులున్నాయి. కేరళ, తమిళనాడు, మహారాష్ట్రలో పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. గతంలోలాగే ఈ సీజన్‌లో కూడా కొవిడ్ ఫియర్‌లో కేరళ రాష్ట్రమే ముందుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. ఎటువంటి పరిస్థితికైనా సిద్ధమవ్వాలని అని స్వయానా కేరళ ఆరోగ్య మంత్రే హెచ్చరించారు. పాండిచ్చేరి, ఢిల్లీ, గుజరాత్, రాజస్థాన్, సిక్కిం, హర్యానా, కర్ణాటక, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు సైతం అటెన్షన్ మోడ్‌లోకి వచ్చేశాయి.తెలుగురాష్ట్రాల్ని కూడా ఎలర్ట్ చేసింది కొవిడ్ ఫియర్. పొరుగు రాష్ట్రాల్లో కేసుల సంఖ్య పెరగడంతో స్పెషల్ అడ్వైజరీ జారీ చేసింది ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ. వీలైనంతవరకు పార్టీలు, ఫంక్షన్లు, ప్రార్థనలకు దూరంగా ఉండాలి. రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, ఎయిర్‌పోర్ట్‌ల్లో మాస్క్ వేసుకోవడం భౌతిక దూరం పాటించడం తప్పనిసరి. 60 ఏళ్లు పైబడిన వాళ్లు, గర్భవతులు ఇంట్లోంచి బైటికి రావద్దు. తరచూ చేతులు కడుక్కోవాలి, జ్వరం, దగ్గు, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే కోవిడ్ టెస్ట్ చేయించుకోవాలి. అనారోగ్యంగా ఉంటే బైటకు వెళ్లకండి.. అని సూచించింది ఏపీ హెల్త్ డిపార్ట్‌మెంట్. పరీక్షల కోసం ల్యాబ్స్ సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్యాధికారుల్ని అప్రమత్తం చేసింది కూడా.ఈ ఏడాది జనవరిలో మహారాష్ట్ర కోవిడ్ సంబంధిత సమస్యలతో ఇద్దరు మరణించారు. వీళ్లకు మిగతా అనారోగ్య సమస్యలు కూడా ఉండడంతో అప్పట్లో తేలిగ్గా తీసుకున్నాయి ప్రభుత్వాలు. ఇప్పుడు కూడా మిగతా ఆసియా దేశాలతో పోలిస్తే భారత్‌లో ఆందోళన పడాల్సిన పనే లేదు. ఎందుకంటే.. ఒక్క హాంకాంగ్‌లోనే 30మందికి పైగా చనిపోయారు. థాయ్‌లాండ్‌లో ఏప్రిల్ నుంచే కొవిడ్ టెర్రర్ ఉంది. ఒక్క బ్యాంకాక్‌లోనే ఆరువేల కేసులు నమోదయ్యాయి. మన దేశపు జనాభాతో పోలిస్తే ప్రస్తుతమున్న కేసుల సంఖ్య చాలా తక్కువ. అంతమాత్రాన కరోనా ఉనికి లేదని ఊపిరి పీల్చుకోడానికి లేదు. ఎందుకంటే.. టెస్టుల సంఖ్యను బట్టే కేసుల సంఖ్య ఆధారపడి ఉంటుంది. కొవిడ్ సంకేతాలు కనిపించగానే టెస్టుల కోసం క్యూ కట్టే పరిస్థితి ఇంకా మన దేశంలో లేదు. ఇప్పుడు సర్క్యులేషన్‌లో ఉన్న వైరస్.. ఒమిక్రాన్ ఫ్యామిలీలోని జేఎన్1 అనే వేరియంట్ నుంచి వచ్చిన సబ్‌వేరియంట్. ఒరిజినల్ వైరస్‌తో పోలిస్తే, దీని తీవ్రత చాలాచాలా తక్కువ. థర్డ్ వేవ్‌లో వచ్చిన ఒమిక్రాన్ వేరియంటే అప్పట్లో పెద్దగా ప్రభావం చూపలేదు. తాజా వేరియంట్‌తో పెద్దగా భయపడాల్సిన అవసరం లేనట్టే..! 100 మందికి వైరస్ సోకితే ఐదుగురు కూడా ఆస్పత్రిలో చేరే అవసరం రాదు. కానీ.. కొవిడ్ ఉనికి తీవ్రతను బట్టి దేశాలన్నీ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నదీ ప్రపంచ ఆరోగ్య సంస్థ గైడ్‌లైన్. అందుబాటులో ఉన్నంత మాత్రాన బూస్టర్ వ్యాక్సిన్ వేసుకోవచ్చా..? అనేది కొత్తగా పుట్టిన భయం.ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఈఆం.. కొవిడ్ వ్యాక్సిన్ రెగ్యులేషన్స్‌ని మార్చేసింది. 65 ఏళు పైబడినవాళ్లు మాత్రమే బూస్టర్ షాట్స్ తీసుకోడానికి అర్హులని తేల్చింది. ఇంతకంటే భయపెట్టే విషయం ఏంటంటే.. వ్యాక్సినేషన్ తర్వాత గుండెసంబంధిత వ్యాధులు రావొచ్చని హెచ్చరిస్తోంది ఈఆం. ఈ మేరకు లేబుల్ మీద వార్నింగ్ ఇవ్వాలని వ్యాక్సిన్ తయారీ కంపెనీ లను ఆదేశించింది కూడా. సో.. బూస్టర్ వ్యాక్సిన్ వేసుకుం దాం.. కొవిడ్ బారిన పడకుండా తప్పించుకుందాం అని ఆశపడితే గుండెపోటుకు దొరికిపోయే ఛాన్సు ఉంది. తస్మాత్ జాగ్రత్త..!

## అక్రమాలు చేస్తే చర్యలు తప్పవు

**హైదరాబాద్ :** తెలంగాణలో పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందించనుంది. ఈ పథకం కోసం లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం వీటిని నిశితంగా పరిశీలించి.. అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియ ప్రారంభించింది మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు.ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు జరిగితే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడైనా అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తే.. వాటిని మంజూరు చేసిన అధికారులపైనే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అవసరమైతే అలాంటి అదికారుల సర్వీసు రద్దు చేస్తామన్నారు.ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తే.. ముందుగా సదరు అధికారిని సస్పెండ్ చేస్తామని.. ఆ తర్వాత నిజనిర్ధారణ చేసి.. ఆరోపణలు వాస్తవమని తేలితే.. అలాంటి అధికారిని సర్వీస్ నుంచి రిమూవ్ చేస్తామని వెల్లడించారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్ లో మీడియాతో మాట్లాడుతూ పొంగులేటి ఈ వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం భూభారతి, ఇందిరమ్మ ఇండ్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని చెప్పారు. భూభారతి అమలుపై ప్రత్యేక నిఘా ఉంటుందని వెల్లడించారు.ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుకు సంబంధించి.. మూడు, నాలుగు దశల్లో క్రాస్ చెక్ చేసిన తర్వాతే అర్హులకు ఇండ్లు కేటాయిస్తున్నామన్నారు. జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి ఇండ్లలో గృహ ప్రవేశాలు చేసేలా వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా పొంగులేటి చెప్పుకొచ్చారు. ఇప్పటి వరకు 1.95 లక్షల లబ్ధిదారులను గుర్తించామన్నారు. మిగిలిన వారిని ఈ నెలాఖరు లోపు ఎంపిక చేస్తామని తెలిపారు. అలానే ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు అదనంగా 10 వేల ఇండ్లు ఇస్తామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 9,800 చెంచు కుటుంబాలు ఉన్నట్లు గుర్తించామని, వాళ్లందరికీ ఇండ్లు ఇస్తామని మరోసారి ఆయన స్పష్టం చేశారు.గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి వల్ల రాష్ట్రంలోని ప్రతీ కుటుంబం ఇబ్బంది పడిందని మంత్రి పొంగులేటి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన భూభారతి పథకం అమలు కింద పైలట్ మండలాలుగా ఎంపిక చేసిన వాటిల్లో వచ్చిన సమస్యల్లో.. కోర్టులో ఉన్నవాటిని తప్పించి మిగిలిన వాటిని జూన్ 2లోగా పరిష్కరిస్తామని తెలిపారు. అలానే రాష్ట్రంలో 413 గ్రామాలకు ఇప్పటి వరకు నక్షాలు, సర్వే రికార్డులు లేవని, వాటిలో ఐదింటిని పైలట్ గ్రామాలుగా ఎంపిక చేసి సర్వే చేయబోతున్నట్లు చెప్పారు.

## టిటిడి ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యునిగా దివాకర్ రెడ్డి ప్రమాణస్వీకారం

**తిరుమల :** టిటిడి ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యునిగా తుడ ఛైర్మన్ దివాకర్ రెడ్డి శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి చెంత టిటిడి అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. దివాకర్ రెడ్డి శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం అదనపు ఈవో శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్నిఅందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, బోర్డు సెల్ డిప్యూటీ ఈఓ ప్రశాంతి, విజిఓ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి ఓఎస్‌డీనంటూ మోసం

**హైదరాబాద్ :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేరుతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతను మాజీ రంజీ క్రికెట్ ప్లేయర్. గతంలో కూడా ఇలాంటి మోసాలకు పాల్పడినట్టు రికార్డు ఉంది. శ్రీకాకుళం జిల్లా బుడమూరు నాగరాజు అనే వ్యక్తి మరోసారి మోసాలు చేస్తూ పోలీసులకు చిక్కాడు. ఈసారి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేరు చెప్పి వివిధ సంస్థల నుంచి వసూళ్లకు పాల్పడినట్టు కేసు నమోదు అయింది. ఈ మేరకు గురువారం పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓఎస్‌డీని అని చెప్పుకొని వివిధ సంస్థల నుంచి వసూళ్లకు పాల్పడ్డాడు. ఆంధ్రా రంజీ మాజీ క్రికెటర్ అయిన నాగరాజుది శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేట. ఇలా ప్రముఖుల పేర్లు చెప్పుకొని ఈజీగా డబ్బులు సంపాదించే మోసాలు ఎప్పటి నుంచో చేస్తున్నాడు. గతంలో ఇలాంటి కేసుల్లోనే ఇరుక్కున్నాడు. అయినా తన బుద్ధి మార్చుకోలేదు. మళ్లీ అలాంటి ప్రయత్నం చేసి అరెస్టు అయ్యాడు. ఈసారి కూడా సీఎం రేవంత్ రెడ్డి పేరు చెప్పి వసూళ్లకు ప్రయత్నించాడు. రేవంత్ రెడ్డి ఓఎస్‌డీ పేరుతో ఫేక్ మెయిల్ ఐడీలు, ఇతర గుర్తింపు కార్డులు సృష్టించి వివిధ సంస్థలను బెదిరించాడు. వ్యాపారులకు ఫోన్‌లు చేసి వసూళ్ల దందా మొదలు పెట్టాడు. కొందరు వ్యాపారులు ఆరా తీస్తే ఇదంతా ఫేక్ అని తెలిసింది. దీంతో విషయాన్ని సీఎంవో అధికారులకు చేరవేశారు. ముఖ్యమంత్రి పేరుతో దందా చేస్తున్న వ్యక్తిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు నమోదు చేసిన పోలీసులు నాగరాజుపై నిఘా పెట్టి అరెస్టు చేశారు. శ్రీకాకుళంలో ఉండగానేపోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి హైదరాబాద్ తీసుకొచ్చారు. అతని వద్ద ఉన్న ఫోన్, ఇతర గాడ్జెట్స్‌ను సీజ్ చేశారు. నాగరాజు గతంలో కూడా ఇలాంటి మోసాలకు పాల్పడ్డాడు. 2020లో ప్రముఖల పేర్లు చెప్పుకొని వ్యాపారులను బెదిరించి డబ్బులు వసూళ్లు చేసేందుకు యత్నించాడు. అప్పుడు కూడా కేసులు నమోదు అయ్యాయి. ప్రస్తుతం అతనిపై నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ నాంపల్లి కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఒకటికాదు రెండు కాదు పదిహేనుకుపైగా కేసుల్లో ఇతని ప్రమేయం ఉందని పోలీసులు చెబుతున్నారు.

## మెట్రో కొత్త చార్జీలు



**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో అధిక మంది జనాలు మెట్రోల్లో ప్రయాణిస్తుంటారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా సులువుగా గమ్యస్థానాల్ని చేరడానికి మెట్రో మార్గాన్ని ఎంచుకుంటున్నారు. అయితే తాజాగా మెట్రోల్లో చార్జీలను పెంచుతూ యాజమాన్యం ప్రకటన జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై సర్వత్రా వ్యతిరేకత రావడంతో ఎల్ అండ్ టీ యూటర్న్ తీసుకుంది. పెంచిన మెట్రో చార్జీలను సవరించిన హైదరాబాద్ మెట్రో సంస్థ.. శుక్రవారం కొత్త చార్జీల చార్టును విడుదల చేసింది. ఇందులో 10 శాతం డిస్కౌంటు ఇస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. తగ్గిన చార్జీలు మే 24వ తేదీ నుంచి అమలులోకి రానున్నట్టు మెట్రో రైలు సంస్థ ప్రకటించింది. ఈ మేరకు కొత్త చార్జీలు విడుదల చేసింది.

ఫేర్ జోన్ వారీగా సవరించిన హైదరాబాద్ మెట్రో రైల్ కొత్త చార్జీల చార్టు ఇదే..
2 కిలోమీటర్లలోపు ఛార్జీ రూ.11
2 నుంచి 4 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.17
4 నుంచి 6 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.28
6 నుంచి 9 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.37
9 నుంచి 12 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.47
12 నుంచి 15 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.51
15 నుంచి 18 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.56
18 నుంచి 21 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.61
21 నుంచి 24 కిలోమీటర్ల వరకు ఛార్జీ రూ.65
24 ఆపై కిలోమీటర్లకు ఛార్జీ రూ.69

జోన్ వారీగా ఫేర్ ఫిక్సేషన్ కమిటీ నిర్ణయించిన పెంపునకు సంబంధించి ప్రయాణికులకు 10 శాతం డిస్కౌంటు ఇస్తూ ఈ మేరకు ప్రకటన జారీ చేసింది. మే 24 నుంచి పేపర్ క్యూఆర్/టోకెన్, డిజిటల్ టికెట్లు, స్మార్ట్ కార్డులు.. అన్ని చెల్లింపులకు వర్తిస్తుంది. ప్రయాణికులు స్మార్ట్ కార్డులు, డిజిటల్ ప్లాట్‌ఫాంలను ఉపయోగించి స్మార్ట్‌గా ప్రయాణించాలని ప్రయాణికులకు మెట్రో సంస్థ విజ్ఞప్తి చేసింది. నగర వాసులకు సురక్షితమైన, విశ్వసనీయమైన, అందుబాటు స్థాయిలో చార్జీలతో మెట్రో సేవలను అందించాలన్న లక్ష్యంతో ఎల్ అండ్ టీ మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇతర వివరాలు అధికారిక వెబ్‌సైట్ లిలిలి.శ్రీబిఎవబితీనీ.ఇనీఎలో చెక్ చేసుకోవచ్చు.

## వాయుగండం, అల్పపీడనం.. వానలే ..వానలు



**హైదరాబాద్ :** రాగల 2-3 రోజులలో కేరళ తీరాన్ని నైరుతి రుతుపవనాలు తాకనున్నాయి. తూర్పు మధ్య అరేబియా సముద్రంపై ఏర్పడిన చక్రవాత ఆవర్తనం ప్రభావంతో, తూర్పు మధ్య అరేబియా సముద్రం, దక్షిణ కోంకణ్ ? గోవా తీర ప్రాంత సమీపంలో అల్పపీడనం ఏర్పడింది. దీంతో రాగల 24 గంటల్లో అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. మరోవైపు ఈనెల 27న పశ్చిమ మధ్య, సమీప ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో మరో అల్పపీడన ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ రోజు తెలంగాణలోని అదిలాబాద్, కొమరంభీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ రోజు తెలంగాణలోని ఆరు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.తెలంగాణలోని రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, బయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది.

# తక్కువ ధరకే దొరుకుతాయి.. లాభాలు మాత్రం లెక్కలేనన్ని..!



కాలంలో శరీరం వేడికి గురవుతుంది. అలాంటప్పుడు సహజంగా చల్లదనం కలిగించే ఆహార పదార్థాల వైపు మనం ఆసక్తి చూపిస్తాం. అలాంటి పండ్లలో తాటి ముంజలు మొదటిది. ఈ చిన్న చిన్న ముంజలలో ఉన్న పోషకాలు ఎన్నో ఆరోగ్య సమస్యలను దూరం చేస్తాయి. వేసవి దాహానికి పరిష్కారం మాత్రమే కాదు.. శరీరానికి సమతుల్యం ఇచ్చే సహజ మార్గంగా తాటి ముంజలు నిలుస్తున్నాయి. తాటి ముంజలలో ఉండే సహజ ఫైబర్ పదార్థాలు పేగులకు నెమ్మదిగా పని చేసేలా చేయడమే కాకుండా.. ఆహారం సులభంగా జీర్ణమయ్యేలా చేస్తాయి. రోజూ కొన్ని ముంజలు తీసుకుంటే కడుపు సంబంధిత సమస్యలు తగ్గే అవకాశం ఉంది. తరచూ అజీర్తి, ఉబ్బరంతో బాధపడేవారికి ఇవి సహాయంగా ఉంటాయి. వేసవిలో వేడి వల్ల శరీరంలో నీటి స్థాయి తగ్గిపోతుంది. అలాంటి సమయంలో తాటి ముంజలు తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన తేమను తిరిగి పొందవచ్చు. ఇవి శరీరాన్ని లోపల నుండి చల్లబరుస్తాయి. వేడి గాలుల కారణంగా వచ్చే నీరసం, తలనొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది. కేలరీలు తక్కువగా ఉండటంతో తాటి ముంజలు బరువు తగ్గే ప్రయత్నంలో ఉన్నవారికి సరైన ఎంపిక. ఇవి తక్కువ మోతాదులోనే పొట్ట నిండిన అనుభూతిని ఇస్తాయి. దీని వల్ల ఎక్కువ ఆకలి అనిపించదు. బయట జంక్ ఫుడ్ తినడం తగ్గుతుంది. ఆరోగ్యంగా తినే అలవాటు పెరుగుతుంది. తాటి ముంజల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి మంచి సహాయం చేస్తాయి. ఇవి చర్మాన్ని శుభ్రంగా ఉంచుతాయి. ఎండ వల్ల కలిగే దద్దుర్లు, ఎరుపు, పొడితనాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. వేసవిలో చర్మాన్ని రక్షించుకోవడానికి తాటి ముంజలు మంచిగా పనిచేస్తాయి. తాటి ముంజలలో ఉండే సహజ చక్కెరలు శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. వేసవిలో వేడి వల్ల అలసట వచ్చినప్పుడు కొన్ని తాటి ముంజలు తింటే శరీరం తిరిగి ఉత్సాహంగా మారుతుంది. కాఫీ, ఎనర్జీ డ్రింకుల కన్నా ఇవి ఆరోగ్యానికి మంచివి. తాటి ముంజలు శరీరంలో ఉన్న హానికరమైన పదార్థాలను బయటకు పంపించడంలో సహాయపడతాయి. ఇలా చేయడం వల్ల కాలేయం ఆరోగ్యంగా పనిచేస్తుంది. మలినాలు బయటకు వెళ్లిపోయిన తర్వాత శరీరంలోని ఇతర భాగాలు కూడా బాగా పని చేస్తాయి. గర్భధారణ సమయంలో తాటి ముంజలు తినడం వల్ల జీర్ణ సంబంధమైన సమస్యలు, వికారం వంటి చిన్న అసౌకర్యాలు తగ్గుతాయి. ఇవి సహజంగా చల్లగా ఉండే పండ్లు కాబట్టి శరీరంలో వేడి తగ్గుతుంది. అయితే తినే ముందు తప్పనిసరిగా డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది. వేసవిలో ఎండ తాకిడికి గురవుతున్నప్పుడు తాటి ముంజలు తినడం వల్ల చర్మంపై వచ్చే సన్ బర్న్, దురద, రంగు మారడం లాంటి సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. ఇవి లోపల నుంచి చర్మాన్ని చల్లబరచి, సహజ రక్షణగా నిలుస్తాయి. తాటి ముంజల్లో ఉండే పొటాషియం శరీరంలోని సోడియం స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. దీనివల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. హై బీపీ ఉన్నవారు మితంగా తినడం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. తాటి ముంజలు వేసవిలో కేవలం తాత్కాలికంగా చల్లదనం కలిగించడమే కాదు.. శరీరానికి అవసరమైన సమతుల్యతను కూడా కల్పిస్తాయి. ఇవి సహజంగా లభించే ఫలాలు కాబట్టి ధర తక్కువగా ఉంటుంది కానీ లాభాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే తాటి ముంజలను మన రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా చేర్చుకోవాలి.

# గింజలు చిన్నవిగా ఉన్నా.. తింటే మాత్రం మస్తు లాభాలు!



చియా విత్తనాలు చిన్నవిగా కనిపించినా వాటిలో ఉన్న పోషక పదార్థాలు ఎంతో శక్తివంతంగా ఉంటాయి. మామూలుగా వీటిని ఉదయాన్నే తీసుకునే అలవాటు చాలా మందికి ఉంటుంది. కానీ రాత్రి నిద్రించే ముందు వీటిని తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు అద్భుతంగా ఉంటాయి. చియా గింజల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. రాత్రి తీసుకునే ఆహారం సరిగ్గా జీర్ణమయ్యేలా ఇవి సహాయపడతాయి. జీర్ణక్రియను మెరుగుపరచడం ద్వారా కాలేయం ఉదయం సజావుగా పనిచేయడానికి తోడ్పడుతుంది. మలబద్ధకంతో బాధపడే వారికి చియా గింజలు ఉపశమనం ఇవ్వగలవు. చియా గింజలు నీటిలో నానబెట్టిన తర్వాత దాదాపు పది రెట్లు పెరిగి జెల్ లా మారతాయి. ఇవి కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. ఫలితంగా రాత్రి వేళ ఎక్కువగా తినకుండా నియంత్రించవచ్చు. తక్కువగా తినడమే కాదు ఆరోగ్యాన్ని కూడా కాపాడటంలో ఇవి మంచి సహాయంగా ఉంటాయి. నానబెట్టిన చియా గింజలు నీటిని నిలిపి ఉంచే శక్తి కలిగి ఉంటాయి. శరీరం నిద్రలో ఉండగా నీరు కోల్పోకుండా రక్షిస్తాయి. ముఖ్యంగా వేసవిలో ఇవి ఎక్కువ ఉపయోగపడతాయి. రాత్రి చియా గింజలు తీసుకుంటే శరీరం హైడ్రేటెడ్ గా ఉండి ఉదయం తాజా భావన కలుగుతుంది. చియా విత్తనాల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, కాల్షియం, మెగ్నీషియం, ప్రోటీన్లు వంటి అనేక శక్తివంతమైన పోషకాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని శక్తివంతంగా ఉంచడంతో పాటు ఎముకలకు బలాన్ని అందిస్తాయి. రాత్రి తీసుకుంటే ఈ పోషకాలు నిద్ర సమయంలో శరీరంలో నెమ్మదిగా విడుదలవుతూ పని చేస్తాయి. ఈ విత్తనాల్లో ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ ఉంటుంది. ఇది శరీరంలో సెరోటోనిన్, మెలటోనిన్ అనే హార్మోన్లను ఉత్పత్తి చేసే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ఇది నిద్ర బాగా రావడానికి సహాయపడుతుంది. నిద్రలేమితో బాధపడే వారు ఈ చియా గింజలను తినడం వల్ల మంచి నిద్ర అనుభవించగలుగుతారు. చియా విత్తనాలు తిన్న తర్వాత శక్తిని క్రమంగా విడుదల చేస్తాయి. ఈ ప్రక్రియ వల్ల రాత్రంతా గ్లూకోజ్ స్థాయిలు స్థిరంగా ఉంటాయి. ఇది ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారికి బాగా ఉపయోగపడుతుంది. బ్లడ్ షుగర్ లెవెల్స్ అకస్మాత్తుగా మారకుండా నియంత్రణలో ఉంచేందుకు ఇది సహాయపడుతుంది. చియా గింజలు చిన్నగా కనిపించినా వాటిలో ఉన్న శక్తి చాలా ఎక్కువ. రాత్రి వేళ నానబెట్టిన చియా గింజలను తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. ఇది నిద్రకు తోడ్పడటమే కాకుండా జీర్ణక్రియను మెరుగుపరిచి, ఎక్కువగా తినే అలవాటు తగ్గిస్తుంది. శరీరాన్ని తేమగా ఉంచుతుంది.

# బరువు తగ్గాలంటే వాకింగ్, మైండ్ ఫ్రెష్ కావాలంటే యోగా!



మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే.. ప్రతి ఒక్కరూ రోజూ కొంతసేపు శారీరక కదలికలు చేయడం అవసరం. అందులో ముఖ్యంగా వాకింగ్, యోగాసనాలు మన ఆరోగ్యాన్ని మెరుగుపరిచే రెండు ప్రముఖ మార్గాలు. వాకింగ్ అనేది ప్రత్యేకంగా నేర్చుకోవాల్సిన అవసరం లేని.. అందరూ సులభంగా చేయగలిగే వ్యాయామం. ఇది మన రోజువారీ జీవితంలో సాధారణంగా చేసే పనే అయినా.. దీనివల్ల ఆరోగ్యానికి చాలా లాభాలు ఉన్నాయి. ఉదయం సాయంత్రం కనీసం 30 నిమిషాలు నడిచే అలవాటు చేసుకుంటే.. శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో ఇది చాలా ఉపయోగపడుతుంది. యోగా అనేది కేవలం శరీరానికి మాత్రమే కాదు.. మనసుకు కూడా శాంతిని ఇవ్వగల శక్తివంతమైన సాధన. ఇది భారతదేశంలో ప్రాచీనకాలం నుంచి ఉన్న ప్రత్యేకమైన పద్ధతి. కొన్ని సంవత్సరాల క్రితం ఐక్యరాజ్యసమితి యోగాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఇచ్చింది. యోగా చేసేటప్పుడు మన శరీరంలోని ఒత్తిడి తగ్గుతుంది అని శాస్త్రవేత్తలూ చెప్పారు. యోగా ద్వారా ప్రాణాయామం, ధ్యానం వంటి విధానాలు మనకు మనశ్శాంతిని అందిస్తాయి. ప్రతి రోజు కొద్దిసేపు వాకింగ్ చేయడం అలవాటు చేసుకుంటే శరీర బరువు తగ్గించడం సులభంగా చేయవచ్చు. నడక వలన శరీరంలో పేరుకుపోయిన అదనపు కేలరీలు త్వరగా ఖర్చవుతాయి. అలాగే నడకతో మెటాబాలిజం మెరుగవుతుంది. అంటే మనం తిన్న ఆహారం బాగా జీర్ణమవుతుంది. నడక వల్ల షుగర్, బీపీ, గుండె సంబంధిత సమస్యలను కూడా కంట్రోల్ చేయడం సులభమవుతుంది. యోగాసనాలు శరీరాన్ని నిశ్చలంగా ఉంచడమే కాదు.. లోపల ఉండే శరీర వ్యవస్థలను సరిగ్గా పనిచేయించడంలో కూడా సహాయపడతాయి. యోగా చేసే వాళ్లు బాగా నిద్రపోతారు, ఒత్తిడి తగ్గుతుంది, మనసు ప్రశాంతంగా ఉంటుంది. దీర్ఘకాలంగా చేస్తే యోగాతో జీవనశైలి మారుతుంది. మనశ్శాంతి పెరుగుతుంది, ఆరోగ్యం బాగుంటుంది, మనసు స్థిరంగా మారుతుంది. వాకింగ్ ప్రతి ఒక్కరూ ఏ వయసులో ఉన్నా సులభంగా చేయగలిగే సాధారణ వ్యాయామం. ఇది శరీరానికి ఎక్కువ శ్రమ లేకుండా మంచి ప్రయోజనాలను ఇస్తుంది. యోగాను చేయాలంటే కొంత శిక్షణ అవసరం అయినా.. ఎవరు కావాలన్నా అభ్యాసం చేయవచ్చు. ప్రత్యేకంగా మనశ్శాంతిని కోరేవారు యోగా చేయడం మంచిది. ప్రతిరోజూ కొంతసేపు నడక, కొంతసేపు యోగా చేస్తే శరీరానికి, మనసుకు పూర్తి ఆరోగ్యం లభిస్తుంది. వాకింగ్, యోగా రెండూ మన ఆరోగ్యాన్ని కాపాడే అద్భుత మార్గాలు. నడక శరీరాన్ని చురుకుగా ఉంచితే.. యోగా మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది.

# ఇవి తింటే అందం, ఆరోగ్యం!



మామిడి తొక్కలో శరీరానికి అవసరమైన మంచి పోషకాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. మామిడి తొక్కను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయట. విటమిన్ ఎ, సి, కె వంటి ముఖ్యమైన విటమిన్లు మామిడి తొక్కలో ఎక్కువగా ఉంటాయి. అంతే కాదు ఫోలేట్, మెగ్నీషియం, పొటాషియం, కోలిన్ వంటి ఖనిజాలు కూడా ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు మన శరీరంలో పోషకాల సమతుల్యతను అందించడమే కాకుండా జీర్ణవ్యవస్థను కూడా బలపరుస్తాయి. మామిడి తొక్కను తొక్క తీసుకోకుండా నేరుగా తింటే కష్టంగా ఉంటుంది. అందుకే తొక్కను చిన్న ముక్కలుగా కట్ చేసి నీటిలో ఉడకించి అందులో కొద్దిగా తేనె, నిమ్మరసం కలిపి తాగితే రుచిగా ఉంటుంది. ఇది రక్తాన్ని శుభ్రం చేయడంలో శరీరంలో ఉండే హానికర పదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. రోజూ ఇలా తీసుకుంటే శరీరంలో కాలుష్యం తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుంది. మామిడి తొక్కలో యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు కూడా ఎక్కువగా ఉండటం వల్ల శరీరంలో హానికరమైన ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షణ ఇస్తుంది. ఇవి వివిధ రకాల జబ్బులు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలను నివారించడంలో సహకరిస్తాయి. అంతే కాకుండా ఇది శరీరంలో వృద్ధాప్య చర్యలను కూడా ఆలస్యం చేస్తుంది. ప్రతిరోజూ కూరగాయలతో మాత్రమే కాకుండా.. మామిడి తొక్కతో కూడా పచ్చడి చేయడం చాలా రుచికరంగా ఉంటుంది. తొక్కను సన్నగా తరిగి ఆవాల పొడి, ఉప్పు, మిరప పొడి నూనెతో కలిపి కొన్ని రోజులు నిల్వ ఉంచితే అద్భుతమైన పచ్చడి తయారవుతుంది. ఇది భోజనానికి మరింత రుచిని ఇస్తూ ఆకలిని పెంచుతుంది. ఈ పచ్చడితో మీరు సాధారణంగా తినే ఆహారం కంటే ఎక్కువ ఆహారం కూడా తినగలుగుతారు.మామిడి తొక్కలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆహారం శరీరంలో బాగా జీర్ణమై, అవసరమైన పోషకాలు సరిగ్గా శోషించబడతాయి. దీని వల్ల శరీరం బరువు పెరగకుండా తగినంత శక్తి పొందుతుంది. కాబట్టి బరువు నియంత్రణ చేయాలనుకునే వారికి మామిడి తొక్క చాలా ఉపయోగకరం. ఇంకో మంచి విషయం ఏంటంటే.. మామిడి తొక్కలో ఉన్న విటమిన్ సి చర్మ ఆరోగ్యానికి మంచిది. దీనివల్ల చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. మొటిమల సమస్యలు తగ్గిపోతాయి. వృద్ధాప్యం వల్ల వచ్చే ముడతలు కూడా తగ్గుతాయి. పరిశోధనల ప్రకారం గర్భిణీ స్త్రీల ఆరోగ్యానికి మామిడి తొక్క చాలా ఫలప్రదం. ఇది ఫోలేట్ ని అందించి శిశువు ఆరోగ్యంగా పెరగడానికి అవసరమైన పోషకం అందిస్తుంది. అందుకే గర్భధారణ సమయంలో సరైన మోతాదులో మామిడి తొక్కను తీసుకోవడం మంచిది. వంటల్లో కూడా మామిడి తొక్కను సులభంగా ఉపయోగించవచ్చు. పచ్చడి, చట్నీ రూపంలో తీసుకోవడం లేదా ఉడికించి తేనె, నిమ్మరసం కలిపి తాగడం వలన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. దీన్ని తరచుగా ఆహారంలో చేర్చడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. మామిడి తొక్కలోని విటమిన్లు, ఖనిజాలు యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా ఇది మన ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

# బిజినెస్

## లాభాల్లో ట్రేడవుతున్న దేశీయ స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల నడుమ మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీంతో ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు ప్రధాన షేర్లలో కొనుగోళ్ల అండతో ప్రస్తుతం లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఉదయం 9 గంటల 27 నిముషాల సమయంలో సెన్సెక్స్ 235 పాయింట్ల లాభంతో 81,251 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ 114 పాయింట్ల లాభంతో 24,728 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో ఎటర్నల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐటీసీ, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, నెస్లే ఇండియా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ లాంటి షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. సన్ ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం), టైటాన్ షేర్లు నష్టాల్లో కదలాడుతున్నాయి.

## నికర ఎఫ్‌డిఐల్లో 96 శాతం పతనం




విదేశీ పెట్టుబడులకు భారత్ ఆశజనకంగా కానరావడం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థలో బలహీనతలు డిమాండ్‌ను సన్నగిల్లేలా చేస్తోంది. ఈ నేపథ్యంలోనే గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఏకంగా 96 శాతం పతనమై 353 మిలియన్ డాలర్లకు పడిపోయాయని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వెల్లడించింది. విదేశీ కంపెనీల ఇక్కడి పెట్టుబడుల నుంచి భారత కంపెనీలకు చెందిన విదేశాల్లోని పెట్టుబడులను తీసేస్తే.. మిగిలేది నికర ఎఫ్‌డిఐలుగా పరిగణిస్తారు. కరోనా కాలం 2020-21లోనూ ఏకంగా 44 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. తదుపరి ఏడాది 38.6 బిలియన్లు, 2022-23లో 28 బిలియన్ డాలర్లు, 2023-24లో 10.1 బిలియన్లుగా చివరగా 2024-25లో కేవలం 0.4 బిలియన్లు (353 మిలియన్లు) ఎఫ్‌డిఐలు నమోదయ్యాయి. 2024-25లో స్థూల పెట్టుబడులు 81 బిలియన్లుగా, ఇంతక్రితం ఏడాది 71.3 బిలియన్లుగా, 2022-23లో 71.4 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. అత్యధిక పెట్టుబడులు సింగపూర్, అమెరికా, యుఎఇ, మారిషాస్, నెథర్లాండ్ దేశాల నుంచి అధిక ఎఫ్‌డిఐలు వచ్చాయి. 2024-25లో భారత కంపెనీలు విదేశాల్లో 29.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాయి. ఇంతక్రితం ఏడాది పెట్టుబడులతో పోల్చితే 75 శాతం పెరుగుదల నమోదయ్యింది.

### గోల్డ్ లవర్స్ ఇక కొనేసేయండి..

# బంగారం ధర తగ్గిందోచ్?

గోల్డ్ ధరలు భారీగా పెరుగుతూపోగా.. నిన్న అనగా బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. మరి హైదరాబాద్‌లో ఇవాల్టి బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే.. ఆ ధరలు ఇప్పుడు ఈ స్టోరీలో ఇప్పుడు తెలుసుకుందామా. గోల్డ్ లవర్స్ ఇది వినండి.. గత కొద్దిరోజులుగా బంగారం ధరలు దోబూచులాడుతున్నాయ్. కొద్దిరోజులు బంగారం ధరలు భారీగా పెరుగుతూపోతుంటే.. మరికొద్ది రోజులు తగ్గుముఖం పడుతున్నాయి. వరుసగా రెండు రోజులు రూ. 2650 మేరకు స్వచ్ఛమైన బంగారం ధర.. గురువారం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. 24 క్యారెట్ల బంగారం ధర రూ. 350 మేరకు తగ్గితే.. 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ. 380 మేరకు తగ్గింది. అటు వెండి ధరలు కూడా బంగారం బాటలోనే పయణిస్తున్నాయి. సిల్వర్ రేట్లు భారీగా తగ్గాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 97,530గా ఉండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 89,400గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 89,400గా ఉండగా.. 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 97,530గా ఉంది. అటు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 97,530గా ఉండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 89,400గా ఉంది.



బంగారం బాటలోనే వెండి ధరలు భారీగా తగ్గాయి. గత రెండు రోజులుగా సుమారు రూ. 4 వేల మేరకు పెరిగిన వెండి ధర.. నిన్న(గురువారం) రూ. 1000 మేరకు తగ్గింది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా నగరాల్లో కేజీ వెండి ధర రూ. లక్ష ఉండగా.. చెన్నై, హైదరబాద్, కేరళ, విజయవాడ, విశాఖపట్నంలో కిలో వెండి రూ. 1,11,000గా ఉంది.

# సరికొత్త రికార్డు స్థాయికి బిట్‌కాయిన్ ధర

బిట్‌కాయిన్ సరికొత్త రికార్డ్ బ్రేక్ చేసింది. జనవరి 2025 తర్వాత మరోసారి ఆల్ టైమ్ గరిష్ట స్థాయికి చేరుకుంది. ఈ క్రమంలో మే 22, 2025న ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ 2 శాతం పెరిగిపోయి సరికొత్త గరిష్టానికి చేరింది. ఈ వారం బిట్‌కాయిన్ సరికొత్త సృష్టించింది. ఈ క్రమంలో బిట్‌కాయిన్ ధర మొదటిసారిగా వి110, 000 (రూ.91 లక్షలకు పైగా) స్థాయికి చేరుకుంది. ఆసియా మార్కెట్లలో గురువారం ఉదయం ట్రేడింగ్ సమయంలో బిట్‌కాయిన్ 2.2% వరకు పెరిగి రికార్డ్ స్థాయిని తాకింది. అమెరికాలో స్టేబుల్‌కాయిన్ బిల్లు గురించి అంచనాలు పెరిగిన నేపథ్యంలో ఈ బూమ్ వచ్చింది. ఇది క్రిప్టోకరెన్సీకి కొత్త నియమాలను సృష్టిస్తుందని నమ్ముతున్నారు. ఎక్స్ఛేంజ్‌లో వ్యాపారులు కొనుగోలు చేసిన కాల్ ఆప్షన్‌లలో, అత్యధిక ఓపెన్ ఇంటరెస్ట్ %వి110,000, వి120,000, వి%300,000 స్థాయిలో ఉన్నాయి. ఈ ఎంపికలన్నీ జూన్ 27తో ముగిసిపోతాయి. ఈ క్రమంలో బిట్‌కాయిన్ మరింత పెరుగుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మైఖేల్ సాయిలర్‌తో అనుబంధించబడిన స్ట్రాటజీ అనే కంపెనీ ఇప్పటివరకు %వి%50 బిలియన్ల (రూ.4 లక్షల కోట్లకు పైగా) విలువైన బిట్‌కాయిన్‌లను కొనుగోలు చేసింది. ఇది కాకుండా, కన్వర్టిబుల్ బాండ్లు, ప్రిఫర్డ్ స్టాక్స్ వంటి అనేక కొత్త టెక్ కంపెనీలు కూడా వివిధ మార్గాల్లో బిట్‌కాయిన్‌లను సేకరిస్తున్నాయి. కాంటర్ ఫిట్జ్‌గెరాల్డ్ యూనిట్ అయిన టెథర్ హోల్డింగ్స్, సాఫ్ట్‌బ్యాంక్ గ్రూప్ కలిసి ట్వంటీ వన్ క్యాపిటల్ ఇంక్ అనే కొత్త కంపెనీని ఏర్పాటు చేశాయి. ఇవి బిట్‌కాయిన్ ట్రెజరీపై పని చేస్తాయి. దీంతో పాటు, వివేక్ రామస్వామి కంపెనీ స్ట్రైవ్ ఎంటర్‌ప్రైజెస్ కూడా నాస్‌డాక్ అసెట్ ఎంటిటీస్ ఇంక్‌లో జాబితా చేయబడింది. ఈ క్రమంలో జనవరి, ఏప్రిల్ మధ్య జరిగిన బిట్‌కాయిన్ మునుపటి క్షీణతను తాకిందని ×+ విశ్లేషకుడు టోనీ సైకామోర్ అన్నారు. నిజానికి అది ఒక దిద్దుబాటని, మాంద్యం కాదని అన్నారు. కానీ ఇప్పుడు బిట్‌కాయిన్ వి110,000పైన నిలదొక్కుకుంటే, తదుపరి లక్ష్యం వి 125,000



చేరుకుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. బిట్‌కాయిన్ ధరలలో నిరంతర పెరుగుదల స్టేబుల్‌కాయిన్ చట్టంపై అంచనాలు, పెద్ద కంపెనీల నుంచి క్రిప్టో మార్కెట్ ఆసక్తి మరోసారి బుల్లిష్ మోడ్‌లోకి తీసుకొచ్చింది. ఈ క్రమంలో రాబోయే వారాల్లో బిట్‌కాయిన్ ధరలు మరింత పెరుగుతాయని ఆయా వర్గాలు భావిస్తున్నాయి.

### ఇంగ్లండ్ బ్యాటర్ల సెంచరీల మోత..

# ఏకంగా 565 పరుగులు

సొంత గడ్డపై టీమిండియాతో టెస్టు సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ క్రికెట్ జట్టుకు అదిరిపోయే ప్రాక్టీస్ లభించింది. నాటింగ్‌హామ్ వేదికగా జింబాబ్వేతో జరుగుతున్న ఏకైక టెస్టులో ఇంగ్లండ్ బ్యాటర్లు దంచి కొట్టారు. ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ సాధించింది. 498/3 ఓవర్ నైట్‌స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్.. తమ మొదటి ఇన్నింగ్స్‌ను 565/6 వద్ద డిక్లేర్ చేసింది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు జాక్ క్రాలీ (171 బంతుల్లో 124బీ 14 ఫోర్లు), బెన్ డకెట్ (134 బంతుల్లో 140బీ 20 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఒలీ పోప్ (163 బంతుల్లో 171, 24 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారీ శతకాలతో కదం తొక్కగా... హ్యారీ బ్రూక్(58), రూట్(34) పరుగులతో రాణించారు. జింబాబ్వే బౌలర్లలో ముజారబానీ మూడు వికెట్లు పడగొట్టగా.. చవింగా, మాధవీరే, రజా తలా వికెట్ సాధించారు .కాగా ఇంగ్లండ్ జట్టు తొలి రోజే రికార్డు స్థాయిలో 88 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 498 పరుగులు చేసింది. టెస్టు క్రికెట్‌లో తొలి రోజు నమోదైన రెండో అత్యధిక స్కోరు ఇదే కావడం గమనార్హం. అంతకుముందు 2022లో పాకిస్తాన్‌పై ఇంగ్లండ్ తొలి రోజు 506/4 పరుగులు చేసింది. మరో 9 పరుగులు చేసుంటే ఇంగ్లీష్ జట్టు తమ రికార్డును తామే బ్రేక్ చేసేది.

ఇంగ్లండ్: జాక్ క్రాలే, బెన్ డకెట్, జో రూట్, ఓల్లీ పోప్,






హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జామీ స్మిత్ (వికెట్ కీపర్), గస్ అట్కిన్సన్, సామ్యూల్ జేమ్స్ కుక్, జోష్ టంగ్, షోయబ్ బషీర్ జింబాబ్వే: బెన్ కర్రాన్, బ్రియాన్ బెన్నెట్, క్రెయిగ్ ఎర్విన్ (కెప్టెన్), సీన్ విలియమ్స్, సికందర్ రజా, వెస్లీ మాధేవెరే, తఫాద్జ్వా త్సిగా (వికెట్ కీపర్), రిచర్డ్ నగరవ, బ్లెస్సింగ్ ముజారబానీ, తనకా చివంగ, విక్టర్ న్యాచి

# ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్.. భారత స్టార్ పేసర్ ఔట్?

ఇంగ్లండ్, భారత్ మధ్య జరిగే ఐదు టెస్టుల సిరీస్‌కు ముందే టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు భారత్ స్టార్ పేసర్ మహమ్మద్ షమీ దూరమయ్యే అవకాశాలు ఉన్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. టెస్టు మ్యాచ్‌లో షమీ సుదీర్ఘ స్పెల్స్ వేయలేడని బీసీసీఐ వైద్యబృందం చెప్పినట్లు తెలుస్తోంది. బీసీసీఐ అధికారి ఒకరు.. షమీ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరపున నాలుగు ఓవర్లు వేశాడు. షమీ ఒక రోజులో పది ఓవర్ల కంటే ఎక్కువ ఓవర్లు వేస్తాడా.. అన్న విషయం బోర్డుకు, సెలెక్టర్లకు తెలియదు. ఇంగ్లండ్‌లో టెస్టుల్లో పేసర్లు ఎక్కువ స్పెల్స్ వేసే అవసరం ఉండొచ్చు. అక్కడి పిచ్‌లు ఫాస్ట్ బౌలర్లకు అనుకూలంగా ఉంటాయి. ఎక్కువగా పేసర్లే వికెట్లు తీస్తారు. అందుకే మేం ఎలాంటి ఛాన్స్‌లు తీసుకోలేం అని నేషనల్ మీడియాకు చెప్పుకొచ్చారు. మరోవైపు.. ఇంగ్లండ్ సిరీస్‌కు మరో 20 రోజులే సమయంలో షమీపై వైద్యబృందం కూడా ఓ ప్రకటన చేసినట్టు తెలుస్తోంది. షమీ టెస్టుల్లో సుదీర్ఘ స్పెల్స్ వేయలేడని బీసీసీఐ వైద్యబృందం యాజమాన్యానికి చెప్పినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. అతడిని జట్టులోకి తీసుకుంటే.. ఐదు టెస్టులూ ఆడే అవకాశాలు చాలా తక్కువని ఆ కథనాల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఒకవేళ షమీని టెస్టు సిరిస్‌కు ఎంపిక చేయకపోతే అతడి స్థానంలో అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం లభించవచ్చు. షమీ టెస్టుల్లో చివరిసారిగా ఓవల్‌లో ఆస్ట్రేలియాపై 2023 %ఔజ ఖీఱఅఖుశ్రీ%లో ఆడిన సంగతి తెలిసిందే.



# స్పోర్ట్స్

## పుజారా ఆల్‌టైమ్ భారత జట్టు ఇదే.. రోహిత్, పంత్‌కు నో ఛాన్స్?



భారత టెస్టు క్రికెట్ హిస్టరీలో వెటరన్ ఆటగాడు చతేశ్వర్ పుజారా తనకంటూ ప్రత్యేక పేజీని లిఖించుకున్నాడు. తన అద్భుత బ్యాటింగ్‌తో టీమిండియా నయా వాల్‌గా పేరు గాంచాడు. అయితే ఫామ్ లేమితో సతమతవుతున్న పుజారా కొంత కాలంగా భారత జట్టుకు దూరంగా ఉటున్నాడు. ఈ మధ్య కాలంలో కామెంటేర్‌గా కూడా పుజారా అవతారమెత్తాడు. ఇప్పటికీ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో కొనసాగుతున్న ఈ సౌరాష్ట్ర ఆటగాడు.. భారత సెలక్టర్ల నుంచి పిలుపు వస్తే రీ ఎంట్రీకి సిద్దంగా ఉన్నాడు. ఇక ఇది ఇలా ఉండగా.. తాజాగా స్పోర్ట్స్ తక్ పాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుజారా తన ఆల్ టైమ్ ఇండియా టెస్ట్ ఎలెవన్‌ను ఎంచుకున్నాడు. చతేశ్వర్ తన ఎంచుకున్న జట్టులో ఓపెనర్లగా దిగ్గజ క్రికెటర్లు సునీల్ గవాస్కర్, వీరేంద్ర సెహ్వాగ్‌లకు అవకాశమిచ్చాడు. అయితే పుజారా మూడో స్థానంలో తనకు కాకుండా ది గ్రేట్ వాల్ రాహుల్ ద్రవిడ్‌కు చోటు ఇచ్చాడు. నాలుగు, ఐదు స్థానాల్లో వరుసగా సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లిలకు ఛాన్స్ దక్కింది. ఆరో స్దానంలో వీవీఎస్ లక్ష్మణ్‌ను పుజారా ఎంపిక చేశాడు. ఇక వికెట్ కీపర్‌గా పంత్‌కు కాకుండా లెజెండరీ ఎంఎస్ ధోని అతడు సెలక్ట్ చేశాడు. స్పిన్నర్లగా అనిల్ కుంబ్లే, అశ్విన్.. ఫాస్ట్ బౌలర్లగా జస్ప్రీత్ బుమ్రా, కపిల్ దేవ్‌లకు పుజారా చోటిచ్చాడు. కాగా పుజారా ఎంపిక చేసిన జట్టులో కెప్టెన్ రోహిత్ శర్మ, గ్రేట్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాలకు చోటు దక్కకపోవడం గమనార్హం. పుజారా ఆల్-టైమ్ టెస్ట్ ప్లేయింగ్ ఎలెవన్: సునీల్ గవాస్కర్, వీరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్, సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, వీవీఎస్ లక్ష్మణ్, ఎంఎస్ ధోనీ (వికెట్‌కీపర్), అనిల్ కుంబ్లే, రవిచంద్రన్ అశ్విన్, కపిల్ దేవ్ మరియు జస్ప్రీత్ బుమ్రా.



# గరుడన్ తెలుగు రీమేకె 'భైరవం' ఏ ఓటీటీలో ఉందంటే

'భైరవం' సినిమా మే 30న విడుదల కానుంది. ఇప్పుడు ఈ సినిమా పరిస్థితి ఎలా ఉందంటే  ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా ఉంది. ఈ సినిమా ఓరిజినల్ కాపీ అమెజాన్ ప్రైమ్‌లో ట్రెండ్ అవుతుంది. అలాంటప్పుడు రీమేక్ భైరవం కోసం జనాలు థియేటర్‌కు వస్తారా అనే సందేహాలు వస్తున్నాయి. మరోవైపు ఈ సినిమా దర్శకుడు విజయ్ కనకమేడల నోటిదురుసు వల్ల బాయ్‌కాట్ భైరవం అనే హ్యాష్‌ట్యాగ్ నెట్టింట వైరల్ అవుతుంది. ఒకవైపు వైఎస్సార్‌సీపీ ఫ్యాన్స్..మరోవైపు మెగా అభిమానులు భైరవం సినిమా చూడొద్దని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున్న ప్రచారం చేస్తున్నారు. తమిళ సినిమా 'గరుడన్'కు రీమేక్‌గా 'భైరవం' సినిమాను విజయ్ కనకమేడల తెరకెక్కించాడు. గతేడాదిలో తమిళ్‌లో మాత్రమే విడుదలైన గరుడన్ భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమా అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతుంది.తమిళ నటుడు సూరి లీడ్ రోల్లో నటించగా అతని స్నేహితులుగా శశికుమార్, ఉన్నిముకుందన్ కీలకపాత్రలు పోషించారు. ఈ రూరల్ యాక్షన్ డ్రామాను ఆర్ఎస్ దురైసెంథిల్ కుమార్ డైరెక్ట్ చేశాడు. రూ. 20 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిస్తే.. రూ. 50 కోట్లకు పైగానే కలెక్షన్స్ సాధించింది. వెట్రిమారన్ కథ అందించాడు. భైరవంలో కూడా ముగ్గురు హీరోలు బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ నటించారు. గరుడన్ కథ నచ్చే తెలుగు ప్రేక్షకులకు కూడా చూపించాలని భైరవం తీస్తున్నట్లు దర్శకుడు విజయ్ కనకమేడల ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. అయితే, మాతృకతో పోలిస్తే మన ప్రేక్షకులకు నచ్చేలా అవసరమైన మార్పులు చేసి ఈ సినిమాను తెరకెక్కించామన్నారు. ఒరిజినల్ వర్షన్ చూసిన వాళ్లకి కూడా కొత్త అనుభూతిని అందించేలా ఈ కథలో మార్పులు చేసినట్లు ఆయన అన్నారు.


# రెండు వారాల్లో ప్రభాస్ 'ది రాజాసాబ్' టీజర్

పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం రాజా సాబ్ టాలీవుడ్ డైరెక్టర్ భలే భలే మొగాడివోయ్ ఫేమ్ మారుతి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు సమాచారం. అయితే ఈ మూవీ నుంచి తాజాగా ఒక అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరో రెండు వారాల్లో రాజాసాబ్ టీజర్ రాబోతుందని బేబి నిర్మాత ఎస్‌కేఎన్ వెల్లడించారు. ఈ విషయాన్ని ఒక మూవీ ఈవెంట్‌లో ఆయన వెల్లడించారు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రిద్ధి కుమార్, సంజయ్ దత్ కీలక పాత్రల్లో మెరవనున్నారు.









# పవన్ ఎఫెక్ట్.. త్రివిక్రమ్‌తో చరణ్ మూవీ.. సుక్కు సినిమాకి బ్రేక్!

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వచ్చిన 'గుంటూరు కారం' (2024) సినిమా విడుదలై ఏడాదిన్నర దాటినప్పటికీ, ఆయన తదుపరి చిత్రంపై స్పష్టత లేకపోవడం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. మొదట్లో అల్లు అర్జున్‌తో పాన్-ఇండియా చిత్రం కోసం ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ, అది వర్కౌట్ కాలేదు.   ప్రస్తుతం అల్లు అర్జున్.. తమిళ దర్శకుడు అట్లీతో ఓ చిత్రంలో నటిస్తున్నాడు. ఈ ప్రాజెక్టు 2026 వరకు పూర్తయ్యే అవకాశం లేకపోవడంతో, త్రివిక్రమ్  సినిమా తాత్కాలికంగా వాయిదా పడినట్లు మొన్నటిదాక ప్రచారం జరిగింది. ఇప్పుడు మొత్తానికి ఈ చిత్రం ఉండకపోవచ్చని టాలీవుడ్‌లో టాక్ నడుస్తోంది. బన్నీ ప్రాజెక్ట్‌ని పక్కకు పెట్టి రామ్ చరణ్‌తో పాన్ ఇండియా సినిమా చేసేందుకు త్రివిక్రమ్ రెడీ అవుతున్నాడట.

వెంకీ చిత్రం తర్వాత...

బన్నీ సినిమా వాయిదా పడడంతో  త్రివిక్రమ్ ఈ గ్యాప్‌లో విక్టరీ వెంకటేశ్‌తో ఓ కామెడీ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించేందుకు రెడీ అయ్యాడట. ఈ చిత్రం కథా చర్చలు పూర్తయి, మరికొద్ది రోజుల్లో  సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని సమాచారం. ఇది పూర్తయిన తర్వాత బన్నీతో సినిమా చేస్తాడని మొన్నటి దాకా ప్రచారం జరిగింది. కానీ అది కూడా జరిగేలా లేదు. త్రివిక్రమ్ ఆ ప్రాజెక్టుని పూర్తిగా పక్కకు పెట్టేసి.. రామ్ చరణ్‌తో సినిమా చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడు. పవన్ కల్యాణ్ చొరవతో రామ్ చరణ్ కోసం త్రివిక్రమ్ ఓ క్రేజీ కథను రెడీ చేశాడట. ఇటీవల ఈ కథను చరణ్‌కు చెప్పి ఒప్పించారట. ఈ చిత్రానికి త్రివిక్రమ్ సన్నిహితుడైన పవన్ కల్యాణ్ నిర్మాతగా వ్యవహరించబోతున్నట్లు సమాచారం. పెద్ది చిత్రం పూర్తయిన వెంటనే చరణ్ త్రివిక్రమ్ సినిమాని సెట్స్‌పైకి వెళ్తుందని టాలీవుడ్‌లో టాక్ నడుస్తోంది.   వాస్తవానికి పెద్ది తర్వాత చరణ్ .. సుకుమార్‌తో సినిమా చేయాల్సింది. ఇటీవల సుకుమార్ కూడా తన తదుపరి సినిమా చరణ్‌తోనే అని ప్రకటించాడు. కానీ పవన్ కల్యాణ్ కారణంగా చరణ్.. సుక్కు ప్రాజెక్టుని పక్కకు పెట్టి..త్రివిక్రమ్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. ఈ చిత్రం తర్వాత సుకుమార్‌తో సినిమా చేయాలని భావిస్తున్నాడట. మరి సుక్కు అంతకాలం వెయిట్ చేస్తాడా లేదా మధ్యలో మరో హీరోని చూస్కొని సినిమా చేస్తాడా అనేది తెలియాల్సింది.

# విక్రమ్ సరసన క్రేజీ హీరోయిన్‌కు ఛాన్స్.. హిట్ కాంబినేషన్

చిత్రపరిశ్రమలో వైవిధ్య భరిత కథాచిత్రాలకు కేరాఫ్ చియాన్ విక్రమ్. ఈయన తాను నటించే ప్రతి చిత్రంలోనూ కొత్తగా కనిపించడానికి ప్రయత్నిస్తుంటారు. అలా ఇటీవల తంగలాన్, వీర ధీర సూరన్ చిత్రాల్లో నటించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. కాగా తాజాగా విక్రమ్ తన 63వ చిత్రంలో నటించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి మడోనా అశ్విన్ కథ, దర్శకత్వం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంతకుముందు మండేలా, మావీరన్ వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలకు దర్శకత్వం వహించారన్నది గమనార్హం. కాగా ఈ క్రేజీ చిత్రాన్ని శాంతి పిక్చర్స్ సంస్థ నిర్మించనుంది. ఈ సంస్థ ఇంతకుముందు శివకార్తికేయన్ కథానాయకుడిగా మావీరన్ వంటి విజయవంతమైన చిత్రాన్ని నిర్మించిందన్నది గమనార్హం. కాగా తాజాగా విక్రమ్ హీరోగా నిర్మించే చిత్రానికి సంబంధించిన ఫ్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అయితే ఇందులో విక్రమ్ సరసన నటించే హీరోయిన్ ఎవరన్నది ఆసక్తిగా మారింది. ఇప్పటికే నటి ప్రియాంక మోహన్, అలాగే శ్రీనిధిశెట్టిలలో ఒకరు నటింపజేసే ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. కాగా తాజాగా లక్కీ కథానాయకి మీనాక్షి చౌదరిని నటింపజేయడానికి చర్చలు జరుగుతున్నట్లు సమాచారం.  ఈ కన్నడ బ్యూటీ ఇటీవల తెలుగు, తమిళ భాషల్లో మంచి రేసింగ్‌లో ఉన్నారు. ఈమె ఇంతకు ముందు తమిళ్, తెలుగు భాషల్లో దుల్కర్ సల్మాన్‌కు జంటగా నటించిన లక్కీ భాస్కర్ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. అలాగే వెంకటేష్ సరసన నటించిన తెలుగు చిత్రం సంక్రాంతికి వస్తున్నాం కూడా సూపర్ హిట్ అయింది. దీంతో ప్రస్తుతం ఈమె క్రేజీ కథానాయకిగా వెలుగొందుతున్నారు. కాగా మరోసారి తమిళంలో విక్రమ్‌తో జత కట్టడానికి రెడీ అవుతారా? అన్నది వేచి చూడాలి.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com